VISION BHARATH REPORTER
విభారే
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారే" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా
అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్.
MOBILE:
9494498787,9440232308.

# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 29-06-2023 సంపుటి : 04 సంచిక : 263 పేజీలు : 8 వెల : రూ 3-00

## హైదరాబాద్‌కు ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్ట్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో ఔటర్ రింగ్ రైల్ ఏర్పాటుకు కేంద్రం సన్నాహాలు చేస్తోందని, సర్వే కోసం రూ.14 కోట్ల రూపాయలు కేటాయించనున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు.బుధవారం ఆయన ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఆర్‌ఆర్‌ఆర్, ఔటర్ రింగ్ రైల్‌తో హైదరాబాద్‌కు ఎంతో మేలు కలుగుతుందన్నారు. రీజనల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా రైల్వే ప్రాజెక్ట్ ఉంటుందన్నారు.ఆర్‌ఆర్‌ఆర్ రోడ్డు నిర్మించాలని కేంద్రం నిర్ణయించిందన్న కిషన్‌రెడ్డి.. 350 కి.మీ ఆర్‌ఆర్‌ఆర్ రోడ్డు తెలంగాణలోని చాలా జిల్లాలను కలుపుతుందన్నారు. రూ.26 వేల కోట్లతో ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టు చేపట్టబోతున్నామని, ప్రాజెక్ట్ వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి అందించామని పేర్కొన్నారు. భూసేకరణకు ఖర్చు 50 శాతం కేంద్రమే భరిస్తుందని కిషన్‌రెడ్డి చెప్పారు. ఎంఎంటీఎస్ రెండో దశకు రూ.330 కోట్ల కేటాయింపుతో పాటు, కేంద్ర నిధులతో ఘట్‌కేసర్-రాయగిరి వరుకు ఎంఎంటీఎస్ రైల్ ఏర్పాటు చేయనున్నారు.కాగా, కేంద్ర మంత్రి వర్గం వలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశంలో పరిశోధన రంగం బలోపేతం కోసం నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రైతులు, భూసారం పెంపు, ఆహార భద్రత, పర్యావరణ కోసం పథకాల అమలు, 3,68,676 కోట్ల రూపాయలతో యూరియా సబ్సిడీ పథకం మూడేళ్ల పాటు కొనసాగింపు, చెరుకుకు మద్దతు ధర మరో 315 రూపాయల పెంపునకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

## విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం: జగన్



కురుపాం: వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ నాలుగేళ్లలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని ఏపీ సీఎం జగన్ అన్నారు. పెత్తందారులకే అందుబాటులో ఉన్న చదువును పేద పిల్లల వద్దకు తీసుకొచ్చామని చెప్పారు.పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో 'జగనన్న అమ్మఒడి' నిధులను సీఎం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. స్కూళ్లలో టాయిలెట్స్ మెయింటెనెన్స్, అభివృద్ధి కోసం అమ్మఒడి నిధుల నుంచి రూ.2వేలు ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులకు జగన్ విజ్ఞప్తి చేశారు."పేదరికం కారణంగా ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదనే సంకల్పంతో పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తున్నాం. భావి తరాల భవిష్యత్తు కోసం విద్యపై పెట్టుబడి పెడుతున్నాం. ఈరోజు 42,61,965 మంది తల్లుల ఖాతాల్లో రూ.6,392.94 కోట్లు జమ చేశాం. దీంతో ఒకటో తరగతి నుంచి ఇంటర్ చదివే 83,15,341 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. ఈ నాలుగేళ్లలో విద్యా రంగంపై మన ప్రభుత్వం రూ.66,722.36 కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చదిద్దుతున్నాం. ప్రైవేట్ స్కూళ్లే సర్కారు విద్యాసంస్థలతో పోటీ పడే పరిస్థితిని కల్పించాం"అని సీఎం అన్నారు.

## కోర్టు ఆదేశాలను అమలు చేయరా? వ్యక్తిగతంగా హాజరవ్వండి: హైకోర్టు



అమరావతి: పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి వ్యక్తిగతంగా హాజరుకావాలని హైకోర్టు ఆదేశించింది. ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకంపై దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈమేరకు ఆదేశాలిచ్చింది.ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని గతంలో హైకోర్టు ఆదేశాలిచ్చింది. అయితే, ఆ ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయకపోవడంతో పాఠశాల యాజమాన్యాలు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశాయి. పిటిషనర్ల తరపున న్యాయవాది శ్రీవిజయ్ వాదనలు వినిపించారు. కోర్టు ఆదేశాలను అమలు చేయకపోగా వాటిని నిర్వీర్యం చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. 2013 నుంచి నేటి వరకు విద్యాశాఖలో పనిచేసిన అధికారులు దీనికి బాధ్యత వహించాల్సి ఉంటుందని న్యాయస్థానం తెలిపింది. తదుపరి విచారణ వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

## టీడీపీది బస్సు యాత్ర కాదు..

బోగస్ యాత్ర: మంత్రి ఉషశ్రీ చరణ్



విజయవాడ: టీడీపీది బస్సు యాత్ర కాదు.. బోగస్ యాత్ర అంటూ మంత్రి ఉషశ్రీ చరణ్ మండిపడ్డారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, టీడీపీ కార్యకర్తలే వాళ్ల బస్ యాత్రపై రాళ్లేసే దుస్థితిలో ఆ పార్టీ ఉందన్న మంత్రి..కల్యాణ దుర్గంలో ఉన్నం హనుమంత చౌదరి రౌడీయిజం మరోసారి బయటపడిందన్నారు. ఏ మొహం పెట్టుకొని టీడీపీ నేతలు బస్ యాత్ర చేస్తారంటూ ఆమె దుయ్యబట్టారు."చంద్రబాబు రైతులు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ ఎగ్గొట్టాడు. ఇప్పుడు అంతకంటే ఎక్కువ ఇస్తానంటే ప్రజలు నమ్ముతారా..?. బస్ యాత్ర, తుస్ యాత్ర, బోగస్ యాత్రలకు ప్రజలు మోసపోరు. పవన్ కళ్యాణ్ సభల్లో ఎక్కడ మహిళలు కనిపించడం లేదు. ఎమ్మెల్యేగా గెలవలేని పవన్ కళ్యాణ్‌కు మా సీఎం జగనన్నని ఓడించేంత సీన్ లేదు. చంద్రబాబు, దత్తపుత్రుడు ఎన్ని అబద్దాలు చెప్పిన మళ్లీ సీఎం జగనే" అని ఉషశ్రీచరణ్ స్పష్టం చేశారు.

## నియోజకవర్గ ఇన్‌ఛార్జిల నియామకం, నేతల పనితీరుపై చంద్రబాబు సమీక్ష



అమరావతి: నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిల నియామకం, నేతల పనితీరుపై బుధవారం తెలుగుదేశం అధినేత చంద్రబాబు సమీక్షించారు. నాయకుల మధ్య విభేదాల పరిష్కారం, పార్టీలో చేరికలు, భవిష్యత్‌కు గ్యారెంటీపై ప్రచార కార్యక్రమం వంటి అంశాలపై చర్చించారు.వర్గపోరు ఉన్న స్థానాలపై చంద్రబాబు సమీక్షించారు. గోపాలపురం నియోజకవర్గంలో పార్టీ నేతల మధ్య విభేదాలపై చర్చలో గోపాలపురం ఇన్‌ఛార్జి వెంకటరాజు, పార్టీనేత బాపిరాజులతో భేటీ అయ్యారు.శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్‌సీవీ నాయుడు గురువారం తెదేపాలో చేరనున్నారు. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చంద్రబాబు ప్రణాళికలు రూపొందించారు. వచ్చే నెల మొదటి లేదా రెండో వారం నుంచి భవిష్యత్‌కు గ్యారెంటీ పై జిల్లాల్లో చంద్రబాబు పర్యటనలకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. యువగళం పాదయాత్ర ఒక వైపు, భవిష్యత్‌కు గ్యారెంటీపై చంద్రబాబు ప్రచార యాత్రలు మరో వైపు ఉండనున్నాయి. ఇప్పటికే ఐదు జోన్లలో భవిష్యత్‌కు గ్యారెంటీపై పార్టీ నేతల చైతన్య రథయాత్రలు కొనసాగుతున్నాయి.

## భావితరాలు ప్రపంచాన్ని ఏలే స్థాయికి.. అమ్మ ఒడిపై సీఎం జగన్ ట్వీట్

తాడేపల్లి: మన భావితరాలు ప్రపంచాన్ని ఏలే స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో గతంలో ఎన్నడూ లేనన్ని సంక్షేమ పథకాలను విద్యారంగంలో మన ప్రభుత్వంలో ప్రవేశపెట్టామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.వరుసగా నాలుగో ఏడాదీ 'జగనన్న అమ్మ ఒడి' అమలు కార్యక్రమానికి సీఎం బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా 'అమ్మ ఒడి' పథకంపై ఆయన ట్వీట్ చేశారు."పేద కుటుంబాల్లో తల్లిదండ్రులు తమ బిడ్డల విద్యావసరాల కోసం ఇబ్బంది పడకుండా జగనన్న అమ్మఒడి పథకాన్ని తీసుకొచ్చాం. ఈ పథకం కింద తమ పిల్లలను చదివిస్తున్న 42.64 లక్షల మంది అక్కచెల్లెమ్మల ఖాతాల్లో నేడు రూ.6,393 కోట్లను జమ చేస్తున్నాం. ఈ ఒక్క పథకం కిందే మన ప్రభుత్వం ఈ నాలుగేళ్ళలో రూ.26,067 కోట్లను అక్కచెల్లెమ్మల ఖాతాల్లో నేరుగా జమ చేసింది. విద్యార్థులందరినీ ఉన్నత విద్యావంతులు చేసే లక్ష్యంతో విద్యారంగంలో మరిన్ని విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాం" అని సీఎం జగన్ పేర్కొన్నారు.తాజాగా విడుదలైన నిధులతో కలిపి.. ఇప్పటివరకు ఒక్క జగనన్న అమ్మఒడి ద్వారానే రూ. 26,067.28 కోట్ల మేర ప్రయోజనాన్ని జగనన్న ప్రభుత్వం లబ్ధిదారులకు చేకూర్చినట్లయ్యింది. ఇక గత నాలుగేళ్లలో నాలుగేళ్లలో విద్యా రంగంపై సీఎం జగన్ ప్రభుత్వం రూ.66,722.36 కోట్లను వెచ్చించారు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, విద్యా కానుకతో అడుగడుగునా పిల్లల చదువులకు అండగా నిలుస్తున్నారు.



## ఏపీ ఉద్యోగుల సంఘం నేత సూర్యనారాయణకు స్వల్ప ఊరట

అమరావతి: విజయవాడ పటమట పోలీసులు నమోదు చేసిన కేసులో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేత కేఆర్ సూర్యనారాయణకు స్వల్ప ఊరట లభించింది. విజయవాడ ఏసీబీ కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అనుమతించింది.జులై 7లోగా సూర్యనారాయణ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపి నిర్ణయం చెప్పాలని ఏసీబీ కోర్టును హైకోర్టు ఆదేశించింది. ఏపీ హైకోర్టులో సూర్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం.. విజయవాడ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు వెలువడే వరకు పిటిషనర్‌పై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. ముందస్తు బెయిల్ వ్యాజ్యంపై కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది.



## అమరావతిలో 47వేల గృహాలకు జూలై 8న శంకుస్థాపన: అజయ్‌జైన్



అమరావతి: సీఆర్‌డీఏ పరిధిలో ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన నిరుపేదల సొంతింటి కల సాకారం దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది.సీఆర్‌డీఏ పరిధిలో 50,793 మంది అక్కచెల్లెమ్మలకు 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ఇంటి స్థలాలను ఇప్పటికే ఉచితంగా పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 47వేల గృహాలకు జూలై 8న శంకుస్థాపన చేయనున్నట్టు గృహనిర్మాణ శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ తెలిపారు.ఈ సందర్భంగా అజయ్ జైన్ మీడియాతో మాట్లాడుతూ.. 'గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో 50వేల మంది నిరుపేదలకు మే 26వ తేదీన సీఎం జగన్ చేతులమీదుగా ఇళ్ల పట్టాలిచ్చాం. కేంద్రం తొలిదఫాగా 47వేల ఇళ్లను మంజూరు చేసింది. రెండో దశలో మరో 3వేల ఇళ్లు మంజూరవు తాయి. ఇప్పటికే ల్యాండ్ లెవెలింగ్ కోసం సీఆర్‌డీఏకి రూ.30కోట్లు ఇచ్చాం. ఎల్లుండి గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లతో సమావేశం జరుగనుంది.తాగునీరు, విద్యుత్, డ్రైనేజ్ తదితర మౌలిక సదుపాయాల కల్పనపై నిర్ణయాలు తీసుకుంటాం. లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాల జారీ సహా మ్యాపింగ్, జియో ట్యాగింగ్, షేర్‌వాల్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణాలు చేపడతాం. దశలవారీగా ఆరు నుంచి 9 నెలల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం' అని స్పష్టం చేశారు.

# సంపాదకీయం

**గురువారం 29-06-2023**

## 2050 నాటికి నీటి సంక్షోభం

ప్రపంచవ్యాప్తంగా నీటి వ్యాపారం విలువ 27 వేల కోట్ల డాలర్లు. నీటిపై వివిధ దేశాల్లో బడా బహుళజాతి సంస్థలు ప్రభుత్వాల నుంచి హక్కులు పొంది నీటి వ్యాపారం ద్వారా వేల కోట్ల రూపాయలను తరలించుకుపోతున్నాయి. దీంతో క్రమంగా సహజ నీటి వనరులపై ప్రజలు హక్కులను కోల్పోతున్నారు. ప్రకృతి సహజమైన నీరు సకల జీవరాసులకు సహజంగా లభించాలి. నీటిని తాగు, సాగు అవసరాలకై ప్రజలందరికీ అందేలా చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత. ఆ బాధ్యతను నెరవేర్చటంలో పాలక ప్రభుత్వాలు అత్యధికం విఫలమౌతూ వస్తున్నాయి. సహజమైన నీటి వనరులు లేకపోతే మానవ మనుగడే ప్రశ్నార్ధకమౌతుంది. ఇంతటి ప్రాధాన్యత గల సహజమైన నీరు గత మూడు దశాబ్దాలకు పైగా ప్రైవేట్ పరం చేయడం తీవ్రమైంది.గత 70 సంవత్సరాలలో ప్రపంచ జనాభా మూడు రెట్లు పెరగగా, నీటి వాడకం ఆరురెట్లు పెరిగింది. పరిశ్రమల వాడకానికి నీటి వినియోగం ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. పరిశ్రమలకు నీటి అవసరాలు పెరుగుతున్న కొద్దీ ప్రభుత్వ రాయితీలతో, ప్రజల సొమ్ముతో తమ నీటి అవసరాలను తీర్చుకోవటమే కాకుండా, నీటిపై తమ గుత్తాధిపత్యం కోసం పెట్టుబడిదారుల ప్రయత్నాలు ప్రారంభమైనాయి. పెట్టుబడిదారుల సహజ లక్షణమైన తక్షణ లాభమే తప్ప వారికి నిలకడైన అభివృద్ధి పట్టదు. తాగునీటి అవసరాలు పెరగటంతో పెట్టుబడిదారులకు నీరు ఎంతో లాభసాటి వ్యాపారంగా మారింది. 1992లో డబ్లిన్ వాటర్ కాన్ఫరెన్స్, వరల్డ్ వాటర్ విజన్ నీటిని ఒక ఆర్థిక వస్తువుగా(సరుకు)గా అభివర్ణించింది. జీవించే హక్కు అనేది ప్రజల మౌలిక హక్కు. అందుకు ఆహారం, నీరు, గూడు ప్రజల మౌలిక హక్కుల్లో భాగం. నీరు లేకపోతే జీవితమే ఉండదు. అందువలన అది ప్రజల మౌలిక హక్కు. అది సరుకుగా చూడటం నేరం.మొదటిది, ప్రైవేటీకరణ వలన నీటి వసతుల నిర్వహణ మెరుగుపడుతుందని, నిర్వహణ ఖర్చులు తగ్గుతాయని, సమర్ధవంతంగా నీరు అందుబాటులోకి వస్తుందని. రెండవది, నీరు ఉచితంగా లభించటం వలన అవసరానికి మించి ప్రజలు నీటిని వాడుతున్నారని, ప్రైవేటీకరించడం వలన డబ్బు చెల్లించవలసి రావడంతో నీటిని ప్రజలు పొదుపుగా వాడతారని. ఇవన్నీ ప్రైవేటీకరణను సమర్ధించే వాదనలు. నిజానికి నీరు వృధాగా పోతున్నట్లు ఎక్కడ కన్పించినా, ప్రజలు దానికి మరమ్మత్తులు చేస్తారు. రైతాంగం పైన కూడా ఇలాంటి విమర్శ చేయడం దారుణం. సాగు నీరు వృధా కాకుండా ఉండటానికి నీటి మీటర్లు బిగించాలనే ప్రతిపాదన తెచ్చి తీవ్ర వ్యతిరేకత రావటంతో చంద్రబాబు ప్రభుత్వం వెనక్కి తగ్గింది. నీటి ప్రైవేటీకరణ జరుగుతున్నది జల వనరుల సంరక్షణ కోసం కాదని, వ్యాపారుల దోపిడీ కోసమన్నది వీరు విస్మరించారు.బహుళ జాతి సంస్థలు ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్‌ల మద్దతుతో పబ్లిక్ నీటి వనరులను ప్రైవేటీకరించి తమతో కాంట్రాక్టు కుదుర్చుకోవడం కోసం అర్ధ వలస దేశాలపై విపరీతమైన ఒత్తిడి చేస్తున్నాయి. ఈ నీటి ప్రైవేటీకరణ మొదట లాటిన్ అమెరికాలో ప్రారంభమై నేడు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలకు విస్తరించింది. దీంట్లో కూడా ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్ పాత్ర కీలకంగా ఉంది. వెనుకబడిన దేశాలకు రుణాలు మంజూరు చేసేటప్పుడు నీటిని ప్రైవేటీకరణ చేయాలని షరతులు విధిస్తున్నాయి.ప్రైవేట్ కంపెనీలు అత్యధిక లాభాలకు నీటిని అమ్మడం అంటే, అది మానవ జీవనానికి అత్యంత మౌలిక అవసరమైన నీటిని సాధారణ ప్రజలకు నిరాకరించడమే. 75% వరకు నీటి వ్యాపారం కొన్ని యూరోపియన్ దేశాల, అమెరికా బహుళజాతి కంపెనీల అదుపులో ఉంది. ఈ కంపెనీలు వివిధ దేశాల ప్రభుత్వాలపై నీటిని, నీటి నిర్వహణను ప్రైవేటు పరం చేయాలని విపరీతమైన ఒత్తిడి పెట్టి విజయం సాధించాయి. నీటిని ప్రైవేటీకరణ చేసినప్పుడు బ్రిటన్‌లో 1988-95 మధ్య నీటి బిల్లులు 67% పెరిగాయి. బొలీవియాలో మునిపల్ నీటి సరఫరా ప్రైవేటీకరణ తర్వాతే నీటి బిల్లులు విపరీతంగా పెరిగాయి. ఆ దేశంలోని కొచమాంబ నగరంలో నీటి యుద్ధాలు జరిగాయి. ఫ్రాన్స్‌లో కూడా నీటి బిల్లులు 150% పెరిగాయి. ఆఫ్రికా ఖండంలో నీటి ప్రైవేటీకరణ తర్వాత ప్రజలకు నీటి హక్కు నిరాకరించబడింది. నీటి ధరలు 45% పెరగగా, కంపెనీ లాభాలు 692% పెరిగాయి. ఈ కంపెనీల సీఈఓల జీతాలు 700% పెరిగాయి. ఒక దశాబ్దం కాలంలోనే దేశంలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో నడిసే ప్రాజెక్టుల సంఖ్య 300కు చేరింది. మహారాష్ట్రలో 48, కర్ణాటకలో 26, తమిళనాడులో 25, ఢిల్లీలో 20, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 15 ప్రాజెక్టులు ప్రైవేట్ భాగస్వామ్యంలో నడుస్తున్నాయి. నీటి సరఫరాలో ఇతర దేశాల్లో లాగానే భారత్‌లోనూ ప్రైవేట్ రంగం విఫలమైంది. టాటా సమూహానికి చెందిన జేయూఎస్‌సిఓ, జెంషెడ్ పూర్‌తో పాటు మైసూర్, భోపాల్, గ్వాలియర్, కొలకతా, హాల్దియా, ముజఫర్‌పూర్, చెన్నయ్ నగరాల్లో జల నిర్వహణ బాధ్యతలు తీసుకుని విఫలమైనాయి.జల విధానం రాక ముందే, భారతదేశంలో 1990లో జల వనరుల ప్రైవేటీకరణ ప్రారంభమైంది. శివనాథ్ నదిలో 23 కిలోమీటర్ల దూరం పాటు రేడియస్ వాటర్ సప్లయ్‌కి 22 సంవత్సరాలు మధ్యప్రదేశ్ ప్రభుత్వం 1998లో ఒక కార్పొరేట్ సంస్థకు లీజుకు ఇచ్చింది. ఫలితంగా మొదటిసారి ఒక నది కార్పొరేట్ సంస్థ చేతుల్లోకి పోయింది. 23 కిలోమీటర్ల నదికి ఇరువైపుల కార్పొరేట్ సంస్థ కంచె వేసింది. ఫలితంగా ఆ పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు నీటిని వాడుకోవటం పైనా, చేపల వేటపైనా నిషేధానికి గురయ్యారు. ప్రైవేటీకరణ దుష్పరిణామాలను గమనించిన రాష్ట్ర పబ్లిక్ అకౌంట్ కమిటీ లీజు ఒప్పందాన్ని రద్దు చేయాలని సిఫార్సు చేసినా, మధ్యప్రదేశ్ ప్రభుత్వం లీజుని కొనసాగించింది. సూయజ్, వివెండి, థేమ్స్ వాటర్, బెక్టెల్ వంటి పెద్ద బహుళజాతి కంపెనీలు భారతదేశంలో నీటి ప్రాజెక్టులు నడుపుతున్నాయి.నీటి వ్యాపారం ద్వారా బడా కంపెనీలు వేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తుండగా, ప్రజల జేబులు మాత్రం ఖాళీ అవుతున్నాయి. 1990లలో పార్లే కంపెనీ మనదేశంలో 'బిస్లరీ' పేరుతో వాటర్ బాటిల్స్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం దేశంలో 3వేల ఆర్గనైజ్డ్, 12వేల అన్-ఆర్గనైజ్డ్ వాటర్ బాటిల్ కంపెనీలు ఉన్నాయనే అంచనా ఉంది. పెప్సి, కోకాకోలా వంటి బహుళజాతి కంపెనీలు ఆక్వాఫీనా, కిన్లీ వంటి బ్రాండ్లతో నీటి వ్యాపారం ద్వారా వేల కోట్ల భారత సంపదను కొల్లగొడుతున్నారు. బిస్లరీ, కిన్లే, ఆక్వాఫీనా, బెయిలీ, హిమాలయన్ మినరల్ వాటర్, మానిక్ చంద్ ఆక్సీరిస్ మినరల్ వాటర్, టాటా వాటర్ ప్లస్, రైల్ నీర్‌లు భారతదేశంలో అతిపెద్ద వాటర్ కంపెనీలు. 2022నాటికి భారత్‌లో 43,663 కోట్ల నీటి వ్యాపారం జరగగా, 2024 నాటికి ప్రతి సంవత్సరం 60,500 కోట్ల నీటి వ్యాపారం జరుగుతుందనే అంచనా ఉంది.బడా వ్యాపార సంస్థల నీటి వ్యాపారం ప్రమాదంగా మారి ప్రపంచవ్యాపితంగా నీటి కొరత ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని అనేక మంది నిపుణులు తెలియచేస్తున్నారు. భారతదేశంలో 2050 నాటికి నీటి సంక్షోభం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని కూడా నివేదికలు తెలుపుతున్నాయి. ఈ పరిస్థితుల నుంచి ప్రజలు బయటపడాలంటే, సహజ నీటి వనరులపై ప్రజలదే హక్కని, నీటి వనరులను ప్రైవేటీకరణ చేసే హక్కు ప్రభుత్వాలకు లేదని, బహుళజాతి కంపెనీల నీటి వ్యాపార అనుమతులను రద్దు చేయాలని ప్రపంచ దేశాల ప్రజలు, భారతదేశం ప్రజలు ఉద్యమించాలి.

## అపర చాణక్యుడు మన పివి నరసింహారావు.- యం సుధాకర్ బాబు.



కర్నూలు జూన్ 28 విభారె న్యూస్. భారత మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు అజాతశత్రువు,అపర చాణక్యుడు అని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు యం సుధాకర్ బాబు ఆయన సేవలను కొనియాడారు. పివి నరసింహారావు 103వ జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. తెలుగువారి ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపజేసిన ఎందరో మహానుభావుల్లో మన పివి నరసింహా రావు ఎనలేని కీర్తి దక్కించుకున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన హయాంలో భూసంస్కరణల చట్టం తీసుకొచ్చి వందలాది ఎకరాలు కలిగివున్న భూస్వాముల నుంచి భూములను ఒకే చట్టం ద్వారా ప్రభుత్వం స్వాధీనం చేసుకునేట్టు చేశారని భూస్వాముల ఆగ్రహావేశాలను లెక్కచేయకుండా భూసేకరణ చట్టం పకడ్బందీగా అమలు చేసిన ధైర్యశాలి మన పివి ని భూస్వాముల కుటుంబానికి చెందిన పీవీ తన పన్నెండు వందల ఎకరాల భూమిని భూమిలేని పేదలకు పంచారని పివీ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పెత్తందార్లు అడవులలోని వన్యమృగాలను చంపడంతో చలించిపోయి వాటి సంరక్షణకు వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని తీసుకొచ్చారని పివీ సేవలను జాతీయ స్థాయిలో ఉపయోగించు కోవాలని భావించిన శ్రీమతి ఇందిరా గాంధీ ఆయనను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమించారని పివి శ్రీమతి ఇందిరా గాంధీ కి అత్యంత నమ్మకస్తుడిగా ఉన్నారని ఎమర్జెన్సీ తర్వాత దేశమంతటా కాంగ్రెస్ ఓడిపోయినా మన రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్ జెండా రెపరెపలాడించాడని నాడు రాష్ట్రంలో 42 పార్లమెంటు స్థానాల్లో 41 స్థానాలు కాంగ్రెస్‌కు రావడం వెనుక పివి పాత్ర కీలకమని ఇందిర గాంధీ హయాంలో తన బహుముఖ ప్రతిభ సామర్థ్యాన్ని అంతర్జాతీయ దౌత్యానికి ఉపయోగించారని ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఆరు మాసాల్లో నంద్యాల పార్లమెంటు స్థానం నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందిన ఘనత మన పివి కి దక్కుతుందని భారత ప్రధానిగా ఉన్న కాలంలో దేశంలో ఎన్నో రాజకీయ ఆర్థిక సామాజిక మలుపులు చోటు చేసుకున్నాయని దివాలా తీసే స్థాయికి చేరుకున్న ఆర్థిక వ్యవస్థకు పునరుజ్జీవం కల్పించి సంస్కరణలకు బీజం వేశారని అందుకే పీవీని దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడిగా పిలుస్తారని దేశాన్ని ఏలిన ఏకైక తెలుగు వాడిగా చరిత్రకెక్కిన పీవీ గొప్పతనం గురించి సుధాకర్ బాబు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.ముందుగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పార్టీ కార్యాలయం నందలి స్వర్గీయ పివి నరసింహారావు చిత్రపటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం కార్యకర్తల సమావేశం జరిగినది.ఈ సమావేశంలో వక్తలు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ గుప్త ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు బి. బతుకన్న కోడుమూరు ఇంచార్జ్ దామోదరం రాధాకృష్ణ మంత్రాలయం ఇంచార్జ్ కే బాబురావు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ సి బజారన్న మైనారిటీ సెల్ సిటీ అధ్యక్షులు ఖాజా హుస్సేన్ మహిళా కాంగ్రెస్ సిటీ అధ్యక్షురాలు ఎస్ ప్రమీల ఎస్సీ సెల్ సిటీ అధ్యక్షులు డబ్ల్యూ సత్యరాజు డిసిసి కార్యదర్శులు రియాజుద్దీన్ ఏజాస్ కాంగ్రెస్ నాయకులు బి సుబ్రహ్మణ్యం జయ కుమార్ దూద్ పీరా ఐ ఎన్ టి యు సి నాయకులు జేమ్స్ మహిళా కాంగ్రెస్ నాయకులు ఎల్లమ్మ కె వెంకటలక్ష్మి మొదలైన వారు పాల్గొన్నారు

## నేడు బక్రీద్ పండుగ సందర్భంగా జంతువధ నిషేధం.

**- మున్సిపల్ కమిషనర్ ఎన్. గంగిరెడ్డి.**



ఎమ్మిగనూరు టౌన్ జూన్ 27 విభారె న్యూస్.ప్రభుత్వ అనుమతి పొందిన జంతు వధ శాలాలలో పశు వైద్య అధికారులు అనుమతి ఇచ్చిన జంతువులను మాత్రమే వదించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్. గంగి రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.గురువారం నిర్వహించే బక్రీద్ పండుగను పురస్కరించుకొని జంతువులను వధించడం ఆనవాయితి.అయితే నిబంధనలకు విరుద్ధంగా బహిరంగంగా ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా రోడ్లపై, ఇళ్ళ వద్ద, అనుమతిలేని జంతువధశాలలో వధించడం చట్టరీత్యా నేరం.ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ జంతు వధ నిషేధ చట్టం యాక్ట్-1977 సెక్షన్-5 ను అనుసరించి గోవులను (ఆవు), దూడలను వధించరాదు.సెక్షన్-8ను అనుసరించి 14 సంవత్సరాల లోపు ఎద్దు, దున్న,గేదె మొదలగు వాటిని వధించకూడని కేవలం ప్రభుత్వ పశు వైద్యుడు ధృవీకరించిన వాటిని మాత్రమే వధించాలని సూచించారు.జిల్లా పశు వైద్య జాయింట్ డైరెక్టర్ చట్టపరమైన నిబంధనలను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మునిసిపల్ చట్టం-1965 లోని సెక్షన్-274ను అనుసరించి పండుగ ఉత్సవములు నిర్వహించు ప్రదేశమునకు వెలుపల వధించరాదని తెలిపారు. ఈ నిభంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

## శ్రీ నృసింహా స్వామి జన్మ నక్షత్రం, స్వాతి నక్షత్రం మరియు తొలి ఏకాదశి



నంద్యాల మా ప్రతినిధి జూన్ 28 విభారె న్యూస్ :- నంద్యాల తెలుగు పేటలో శ్రీ మద్దిలేటి లక్ష్మి నరసింహస్వామి వారి ఆలయంలో గురువారం జన్మ నక్షత్రం. స్వాతి నక్షత్రం. మరియు తొలి ఏకాదశి . పురస్కరించుకుని ఆలయం లో ఉదయం అర్చకులు స్వామి వారికి పంచామృత అభిషేకం మరియు స్నపన తిరుమంజన కార్యక్రమం నిర్వహించి తదుపరి స్వామి వారి కి వస్త్రాలు, పూలమాలలు తో అలంకరించి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి ఇవ్వడం జరుగుతుందని కమిటీ వారు తెలిపారు . కావున భక్తులు స్వామి వారి అభిషేకం తిలకించి, మహా మంగళహారతి మరియు తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరు అని కోరారు.

## అర్జునపురంలో భూమా కిషోర్ రెడ్డి పల్లెనిద్ర

**శివాలయానికి రూ.25 వేలు విరాళం**





ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని దొర్నిపాడు మండలము అర్జునపురంలో గ్రామంలో బుధవారం రాత్రి బిజెపి తాలూకా బాధ్యులు భూమా కిషోర్ రెడ్డి పల్లె నిద్ర కార్యక్రమం జరిగింది. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా అర్జునపురం చేరుకున్న ఆయనకు గ్రామ ప్రజలు, భూమా అభిమానులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో పర్యటించి పలు సమస్యలను ప్రజల నుండి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలని, వాటిని వెంటనే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా పోరాడుతామన్నారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు గ్రామంలో గల శివాలయానికి భూమా కిషోర్ రెడ్డి 25 వేల రూపాయల నగదును విరాళంగా అందజేశారు. ఆయన వెంట నాయకులు అంబటి మహేశ్వర్ రెడ్డి, నాగిరెడ్డి పల్లె శంకర్ రెడ్డి, గ్రామ నాయకులు పుల్లయ్య, హర్షవర్ధన్ రెడ్డి, నర్సిరెడ్డి, జల్లి పుల్లయ్య,నాగరత్నారెడ్డి, ఓబయ్య, పాలసుబ్బారెడ్డి, గురు రెడ్డి, నాగేశ్వరరెడ్డి, పెద్ద వెంకటసుబ్బయ్య,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గోవింద నామస్మరణలతో మారుమోగిన అహోబిల గిరులు వైభవంగా సుదర్శన జయంతి వేడుకలు

ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 28 విభారె న్యూస్ :- ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బుధవారం సుదర్శన జయంతి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కిడంబి వేణుగోపాల ఆచార్యులు, అర్చక బృందం ఉత్సవ మూర్తులైన శ్రీ జ్వాల నరసింహ స్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్లతో పాటు సుదర్శన మూర్తిని కూడా ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తులు ఎదుట సుదర్శన జయంతి సందర్భంగా సుదర్శన హోమాన్ని నిర్వహించారు. వేదమంత్రాలు నడుమ నిర్వహించిన హోమం నుండి వెలువడిన కాటుకతో పాటు అర్చకులు భక్తులకు అందజేశారు. ఈ సుదర్శన మహా హోమానికి సుదూర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.





## అర్హులైన వారందరికీ పథకాలు తప్పకుండా అందాలి



ఆదోని గడపగడపలో భాగంగా వైఎస్ఆర్సిపి యువనేత వై జయ మనోజ్ రెడ్డి 36 వ వార్డు మేదరగిరిలో గడపగడపకు తిరుగుతూ అర్హులైన వారందరికీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు తప్పకుండా అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు గడపగడప లో భాగంగా 36వ వార్డు లో ఉన్నవారందరూ తమ తమ వినతులను జయం మనోజ్ రెడ్డికి తెలియజేశారు వాటన్నిటికీ ఆయన సానుకూలంగా స్పందిస్తూ తొందరలో పరిష్కారం చూపుతామన్నారు కొంతమంది రోడ్లు కొంతమంది ఇండ్లు మరి కొంతమంది డ్రైనేజీ ప్రధాన కారణాలుగా తెలియజేశారు వీటన్నిటిని తొందరలో వార్డ్ కౌన్సిలర్ సహాయంతో పరిష్కారం చూపిస్తాను తెలియజేశారు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు అన్నిటిని మనం సద్వినియోగం చేసుకోవాలని మళ్లీ వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని తప్పకుండా ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు

## తాళం వేసివున్న ఇంట్లో భారీ చోరీ

గన్నవరం ఉంగుటూరు మండలం తేలప్రోలు లో తాళాలు వేసి ఉన్న ఇంట్లో భారీ చోరీ జరిగింది. గ్రామానికి చెందిన వింత వీరారెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అయనను ఆపరేషన్ నిమిత్తం కుమారుడు హైదరాబాద్ కు తీసుకు వెళ్లాడు. గత 20 రోజుల నుంచి ఇంటికి తాళాలు వేసి ఉండటాన్ని దుండగులు గమనించారు. చోరీ చేసారు. ఆపరేషన్ చేయించుకుని ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో సమీప బంధువులకు ఇంటిని శుభ్రం చేయమని వీరారెడ్డి కుమారుడు చెప్పాడు. బంధువుల వచ్చి ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురు గా వుండడం, బీరువా పగలగొట్టి బంగారం వెండి నగదు అపహారించినట్లు గుర్తించారు. భారీ మొత్తంలో బంగారం నగదు వెండి అపహరణకు గురైనట్లు బాధితులు చెబుతున్నారు. ఇంటి యజమానులు లేకపోవడంతో వారు వచ్చిన తర్వాత అసలు ఎంత ఏమి పోయింది అన్నది బయటపడాల్సి ఉంది. బంధువుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

## వరాహి యాత్ర విజయవంతం కావాలి

తిరుమల బుధవారం నాడు మచిలీపట్నం నియోజకవర్గ నుంచి స్థానిక పెదయాధర సర్పంచ్ మరియు మచిలీపట్నం జనసేన పార్టీ మండల అధ్యక్షులు గల్లా తిమోతి, ఇతరులు శ్రీవారిని దర్శించుకోవడం జరిగింది గత 15 రోజులుగా ఆంధ్రప్రదేశ్ ఉభయగోదావరి జిల్లాలలో వారాహి విజయయాత్ర నిర్వహిస్తున్న జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వారాహి యాత్రలో కోర్ కమిటీ సభ్యులుగా బాధ్యతలు నిర్వహిస్తూ ఈ రోజున తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనార్థం తిరుపతి రావడం జరిగిందని తెలిపారు. వారాహి విజయ యాత్ర సంకల్పించిన పవన్ కళ్యాణ్ కి అంతా మంచి జరగాలని మరియు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. రాబోయే రోజుల్లో ఆయన ముఖ్యమంత్రిగా ప్రజలు మనలను పొంది బాధ్యతలు చేపట్టాలని గల్లా తిమోతి శ్రీవారిని వేడుకున్నారు ఈ కార్యక్రమంలో గుడివాడ జనసేన పట్టణ ఉపాధ్యక్షులు వేమూరి త్రినాథ్ పెదయాధర పంచాయతీ ఆరో వార్డు మెంబర్ కంచర్ల పల్లి సీతయ్య తదితరులు పాల్గొన్నారు

## శ్రీ చైతన్య కళాశాలకు తాళం వేసిన ఎస్ఎఫ్ఐ నేతలు

శ్రీకాకుళం శ్రీకాకుళం పట్టణంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ( ఎస్ఎఫ్ఐ) శ్రీకాకుళం జిల్లా కమిటీ నాయకులు శ్రీ చైతన్య కళాశాలలో పాఠ్యపుస్తకాల అమ్మకాలును అడ్డుకున్నారు. ఈ మేరకు కళాశాల యాజమాన్యం ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ విక్రయించడానికి ప్రయత్నిస్తున్న తరుణంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకొని గదికి తాళం వేశారు. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కళాశాల ఏజీఎం తిరుపతిరావు ఇకపై కళాశాలలో పుస్తకాలు, యూనిఫామ్స్ గాని విక్రయించమని లిఖితపూర్వకంగా రాసి ఎస్ఎఫ్ఐ నాయకులకు అందజేసారు. ఈ సదర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ రాజు బి హరీష్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు సంతోష్, రేవతి తదితరులు పాల్గొన్నారు.

# వారసులకు లైన్ క్లియర్

విజయవాడ, జూన్ 28, ఏపీలో అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో వరుసగా వారసులకు లైన్ క్లియర్ అవుతోంది. గుంటూరు శాసన సభ్యుడు ముస్తఫా కుమార్తె నూరి ఫాతిమాకు సీట్ ఇచ్చేందుకు సీఎం జగన్ ఓకే చెప్పారనే ప్రచారం జోరుగా సాగుతోంది.వైఎస్ఆర్ సీపీలో వరుసగా వారసులకు లైన్ క్లియర్ అవుతున్నట్లు కనిపిస్తోంది. తాజాగా వైసీపీ నేత, గుంటూరు శాసన సభ్యుడు ముస్తఫా స్థానంలో ఆయన కుమార్తె నూరి ఫాతిమాకు సీట్ ను ఇచ్చేందుకు సీఎం జగన్ అంగీకారం తెలిపినట్లుగా పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఇప్పటివరకు వరుసగా రెండు సార్లు గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా ముస్తఫా విజయం సాధించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని జగన్ ప్రకటించిన నాటి నుండి ఆయన పార్టీలో కొనసాగుతున్నారు. జగన్ రెండు సార్లు టిక్కెట్ ఇవ్వటంతో వరుసగా రెండు సార్లు ఆయన ఎమ్మెల్యేగా గెలుపొంది జగన్ నమ్మకాన్ని వమ్ము చేయలేదు. మైనార్టీ వర్గాల ఓట్ బ్యాంక్ కీలకంగా ఉండే గుంటూరు తూర్పులో ఈ సారి ముస్తఫా తన కుమార్తెకు అవకాశం ఇవ్వాలని గతంలో అనేక సార్లు జగన్ వద్ద ప్రస్తావించారు. అయితే ఇప్పుడు వచ్చే ఎన్నికల్లో ఆయన కుమార్తెకు సీటు ఇచ్చే విషయంలో జగన్ క్లారిటీ ఇచ్చారని అంటున్నారు. తన తండ్రి రాజకీయంగా ప్రోత్సహించటంతో నూరి ఫాతిమా ఇప్పటికే నియోజకవర్గంలో యాక్టివ్ రోల్ పోషిస్తున్నారు. తండ్రి తో పాటుగా నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ఆమె పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు. ప్రజల వద్దకు వెళ్ళి వారితో మీటింగ్ లు పెట్టి, సమస్యలపై స్థానికంగా ఉన్న అధికారులను సైతం సంప్రదించి, వాటిని కొలిక్కి తీసుకురావటం లో కూడ ఆమె కీ రోల్ పోషిస్తున్నారు. ముస్లిం వర్గానికి చెందిన మహిళ కావటం, అందులోనూ తండ్రి వరుసగా రెండు సార్లు నియోజకవర్గంలో విజయం సాధించిన రికార్డ్ కూడ ఉండటంతో ఆమె గెలుపుపై ఇప్పటికే పార్టీ వర్గాలు అంచనాకు వచ్చారని చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రత్యేక సర్వే తరువాత, జగన్ ముస్తఫా రాజకీయ వారసురాలికి లైన్ క్లియర్ చేశారని అంటున్నారు.ఎమ్మెల్యే ముస్తఫా రాజకీయ వారసురాలుగా ఎంట్రీ ఇవ్వనున్న నూరి ఫాతిమా ఇప్పటికే శాసన సభ్యురాలు అంటూ గతంలో పోస్టర్లు సైతం వెలిశాయి. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న ఆమెకు నిర్వాహకులు శాసన సభ్యురాలుగా పేర్కొంటూ బ్యానర్లు వేశారు. అయితే గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యేగా పేర్కొంటూ బ్యానర్ వేయటంతో అది కాస్త వైరల్ గా మారి రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. తండ్రి తూర్పు నియోజకవర్గం నుండి పోటీ చేస్తుంటే, కుమార్తె పశ్చిమ నియోజకవర్గం నుండి సీట్ ఎలా వస్తుందని చర్చ సైతం జరిగింది. అయితే అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టిలో సీట్ రాకపోతే, తన కుమార్తె కోసం ముస్తాఫా తెలుగు దేశం పార్టీలో జాయిన్ అయ్యేందుకు సైతం సై అన్నట్లుగా రాజకీయ వర్గాల్లో ప్రచారం జరిగింది.వైఎస్సార్ సీపలో వారసులకు వరుసగా అవకాశాలు దక్కేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే మచిలీపట్టణం అసెంబ్లీ నియోజకవర్గం నుండి పేర్ని నాని శాసన సభ్యుడిగా ఉన్నారు. జగన్ మెదటి క్యాబినేట్ లో పేర్ని నానికి మంత్రి పదవి కూడా దక్కింది. ఆ తరువాత నుంచి పేర్ని మరింత దూకుడుగా యాక్టివ్ పాలిటిక్స్ లో ఉంటూ, ప్రతిపక్షాలకు కౌంటర్ ఇస్తూ జగన్ దృష్టిని ఆకర్షిస్తున్నారు. దీంతో ఆయన విన్నపం మేరకు పేర్ని నాని వారసుడు, పేర్ని కిట్టుకు సీట్ ఇచ్చేందుకు జగన్ అంగీకారం తెలిపారని అంటున్నారు. ఇప్పుడు గుంటూరు తూర్పు నియోజకవర్గం నుండి మైనార్టీ వర్గానికి చెందిన ముస్తఫా కుమార్తెకు సీట్ దక్కిందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

# వేలిముద్రల ద్వారా డబ్బులు మాయం

నెల్లూరు, జూన్ 28, నెల్లూరు జిల్లాలో సరికొత్త మోసం వెలుగు చూసింది. అకౌంట్లలోనుంచి డబ్బులు మాయమైపోతోందంటూ బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఈ వ్యవహారంపై దృష్టి పెట్టారు. చివరకు పరిశోధించి విషయం తేల్చారు. వేలిముద్రల ద్వారా డబ్బులు మాయం అవుతున్నట్టు గుర్తించారు. మరి బాధితులు వేలిముద్రలు వేయకుండానే ఇదంతా ఎలా జరుగుతోంది, ఆ డబ్బు ఎక్కడికెళ్తోంది, అసలా నిందితుల ప్లాన్ ఏంటి..?ఇదో సరికొత్త మోసం, మనకు తెలియకుండానే మన వేలిముద్రలు దొంగిలించి, మన ఆధార్ కార్డ్ ద్వారా మనకు సంబంధం లేకుండానే మన అకౌంట్లనుంచి డబ్బులు మాయం చేస్తున్నారు కేటుగాళ్లు. ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ ద్వారా ఈ మోసం జరుగుతోంది. ప్రస్తుతం పల్లెటూళ్లలో బ్యాంకింగ్ కియోస్క్ లు ఏర్పాటు చేసి, ఆధార్ నెంబర్ చెప్పి, వేలిముద్ర వేస్తే డబ్బులు విత్ డ్రా చేసి ఇస్తారు, కొంత కమిషన్ తీసుకుంటారు. అయితే దీన్ని అడ్డు పెట్టుకుని, అకౌంట్ హోల్డర్లకు తెలియకుండా డబ్బులు కాజేస్తున్నారు కొంతమంది. ఇలాంటి ఓ ముఠాను నెల్లూరు జిల్లా పోలీసులు పట్టుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో భూముల రిజిస్ట్రేషన్ల సమయంలో వేసే వేలి ముద్రలను దొంగిచించి వాటి ద్వారా వేలిముద్రల కాపీలు తయారు చేసి బ్యాంకుల్లో డబ్బులు కొట్టేస్తున్నారు. ఆధార్ నెంబర్లు కూడా రిజిస్ట్రార్ ఆఫీసుల్లోనుంచే దొంగిలించారు. ఈ ముఠా ఇప్పటి వరకూ 51 లక్షల 25వేల రూపాయలు ఇలా దొంగిలించినట్టు గుర్తించారు. బాధితుల బ్యాంక్ అకౌంట్లనుంచి తమ వ్యాలెట్ లోకి డబ్బులు ట్రాన్స్ ఫర్ చేసుకుంటున్న నిందితులు, వెంటనే దాన్ని విత్ డ్రా చేసుకుంటున్నారు. దీంతో రికవరీ కష్టసాధ్యంగా మారింది. కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ ఆఫీస్ కి సంబంధించి డాక్యుమెంట్ రైటర్ గా పనిచేసే ఓ వ్యక్తి ఇందులో కీలక నిందితుడు. రిజిస్ట్రార్ ఆఫీసుల్లో రిజిస్ట్రేషన్ పనులకోసం వచ్చేవారు, సాక్షులుగా సంతకాలు చేసేవారు వేలిముద్రలు వేయడం, తమ ఆధార్ కాపీలు ఇవ్వడం పరిపాటి. దీని ద్వారా ఈ కేటుగాళు వేలిముద్రలు, దానికి సంబంధించిన ఆధార్ కాపీలు స్కాన్ చేసేవారు. అలా స్కాన్ చేసిన వేలిముద్రలతో బ్యాంకింగ్ కియోస్క్ టెక్నాలజీతో డబ్బులు కాజేసేవారు. బాధితుల్లో ఎక్కువమంది నిరక్షరాశ్యులు, పల్లెటూరివారే ఉన్నారు. ఎప్పటికప్పుడు సెల్ ఫోన్ లో బ్యాంక్ నుంచి వచ్చే మెసేజ్ లు చూడటం వారికి అలవాటు లేదు.

అందుకే బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు ట్రాన్స్ ఫర్ అయినా కూడా వారికి తెలియదు. దీంతో ఈ కేటుగాళ్ల పని సులభమైంది. తీరా ఓ బాధితుడి ఫిర్యాదుతో నెల్లూరు పోలీసులు తీగలాగి, డొంక కదిలించారు. ఇక్కడ నెల్లూరు జిల్లావారు బాధితులే అయినా, 10మంది నిందితులు జిల్లా బయటి వ్యక్తులు కావడం విశేషం. ఇతర జిల్లాల్లో వీరు పనులు చక్కబెట్టారు. ఆన్ లైన్ నుంచి కూడా కొంత డేటా సేకరించారని పోలీసులు అనుమానిస్తున్నారు. వ్యాలెట్ లో ఉన్న సొమ్ముని బ్లాక్ చేశామని, మిగతా సొమ్ము నిందితులనుంచి రికవరీ చేస్తామని చెబుతున్నారు పోలీసులు. ఇలాంటి మోసాలను నివారించాలంటే ఆధార్ తో అనుసంధానంగా ఉన్న ఫింగర్ ప్రింట్ ని డిజేబుల్ చేసుకోవాలని సలహా ఇస్తున్నారు. అలా చేస్తే మన వేలిముద్ర ఎవరికీ కనపడదని, వేలిముద్రలతో మన ఆధార్ ని ఎవరూ ఉపయోగించలేరని చెప్పారు.

# కాపు కార్పొరేషన్ లో అవినీతి మరకలు

విజయవాడ, జూన్ 28, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ కాపు భవన్ లు నిర్మిస్తామని, ఇప్పటికే విజయవాడ, విశాఖ, కర్నూలులో కాపు భవన్ ల నిర్మాణానికి నిధులు విడుదల చేశామని కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషగిరిరావు చెప్పారు. కాపు కార్పొరేషన్ బోర్డ్ సమావేశం తాడేపల్లిలోని ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషగిరి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కాపు సంక్షేమానికి సంబంధించి జిల్లా, నియోజకవర్గాల వారీగా కమిటీల ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికలు సిద్దం చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ ప్రభుత్వ పథకాల కింద కాపుల సంక్షేమానికి అందించిన లబ్ధిని లబ్ధిదారులకు వివరించే కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టనున్నట్లు తెలిపారు. కాపు సంక్షేమం కోసం అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే విజయవాడ కాపు భవన్ కు రూ. కోటి, విశాఖ, కర్నూల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసే కాపు భవన్ కు రూ. 50 లక్షల చొప్పున విడుదల చేశామని తెలిపారు.జగనన్న విదేశీ విద్యా దీవెన కింద ఇప్పటికే 42 మంది ఉన్నత చదువుల కోసం విదేశాలకు పంపించటం జరిగిందని కాపు కార్పోరేషన్ ఛైర్మన్ అడపా శేషు చెప్పారు. జగనన్న విదేశీ విద్యాదీవెన కు పెద్ద సంఖ్యలో ధరఖాస్తులు అందుతున్నాయని, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ అవినీతికి తావులేకుండా ధరఖాస్తులను పరిశీలించి అర్హులందరికి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఒక్క కాపు కార్పొరేషన్ కు మాత్రమే కాకుండా అన్ని కార్పొరేషన్ లకు పెద్ద సంఖ్యలో విదేశీ విద్యా దీవెన అర్జీలు అందాయన్నారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలోని అన్ని రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నాయని, సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారులకు అందచేస్తుండటం గొప్ప విప్లవమని కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషు అన్నారు. వాలంటీర్ల వ్యవస్థ, గ్రామ, వార్డు సచివాలయ ఏర్పటుతో అర్హాలందరి ఇళ్ల వద్దకే వెళ్లి లబ్ధి అందేలా ఈ ప్రభుత్వం చర్యలు తీసుకోవటం హర్షనీయమన్నారు. కుల, మత, ప్రాంత, పార్టీలు చూడకుండా లబ్ధిదారులకు నేరుగా లబ్ధిని అందిస్తున్నట్లు చెప్పారు. తుని 42 కేసులకు పైగా ఎత్తివేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాపు కార్పొరేషన్ లో జరిగిన అవినీతి పై చేపట్టిన విచారణ మరో 15 రోజుల్లో పూర్తవనుందని కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషు చెప్పారు. కాపులకు నిధులు పేరుతో గత ప్రభుత్వంలోని కొందరు అవినీతికి పాల్పడినట్లుగా వచ్చిన ఆరోపణలు నేపద్యంలో విచారణ ద్వార పక్కా ఆధారాలను సేకరిస్తున్నామని అన్నారు. మరో వైపున నవరత్నాలతో సంబంధం లేకుండా కాపులకు మేలు చేయటానికే కాపు నేస్తంను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని, కాపు నేస్తం ద్వారా మూడు పర్యాయాలు మొత్తం రూ. 1500 కోట్ల లబ్ధిని చేకూర్చినట్లు తెలిపారు. కాపు నేస్తం పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది కాపులకు మేలు జరిగిందన్నారు. ప్రభుత్వం పేదలకు అందిస్తున్న లబ్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి నియోజకవర్గంలోని లబ్ధిదారులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

## కాంగ్రెస్ లో నేతలకు కొత్త ఆశలు



విజయవాడ, జూన్ 28, వైఎస్సార్ కుటుంబం మళ్లీ కాంగ్రెస్ కు దగ్గర అవుతుందనే ప్రచారంతో కాంగ్రెస్ శ్రేణులు ఆశగా ఎదురు చూస్తున్నాయి. ఇప్పుడు షర్మిల తరువాత విజయమ్మ, బ్రదర్ అనిల్ కూడా కాంగ్రెస్ లోకి రావాలంటూ నేతలు ఆహ్వానిస్తున్నారు.తెలుగు రాష్ట్రాల్లో తిరిగి పుంజుకోవాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు మొదలుపెట్టింది. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టి అసలు కనిపించకుండా పోయింది. ఇప్పటివరకు ఆ పార్టీకి ఎదురుదెబ్బలే తగిలాయి. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేదు. అయితే ఇటీవల జాతీయ కాంగ్రెస్ కార్యాలయం కేంద్రంగా జరుగుతున్న పరిణామాలతో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ లో నేతలకు కొత్త ఆశలు చిగురిస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి మరణం తరువాత రాష్ట్ర విభజన అంశం తెర మీదకు రావటం, కాంగ్రెస్ పార్టి రాష్ట్రాన్ని విడకొట్టి సంచలన రాజకీయాలకు తెరతీయటంతో పరిస్థితులు ఉన్నపళంగా మారిపోయాయి. అయితే ఇప్పుడు మరోసారి వైఎస్సార్ కుటుంబం తిరిగి కాంగ్రెస్ కు దగ్గర అవుతుందనే ప్రచారం జరగటంతో ఆంధప్రదేశ్ రాజకీయాల్లో దాని ప్రభావం ఉంటుందని అంటున్నారు. షర్మిల కాంగ్రెస్ లో చేరికతో ఎన్నికల సమయంలో ఏపీలో కూడా ఉపయోగం ఉంటుందన్న అభిప్రాయం కాంగ్రెస్ నేతల్లో వ్యక్తం అవుతోంది. షర్మిల కాంగ్రెస్ పార్టిలోకి వస్తారనే అంశం చర్చకు వస్తున్న క్రమంలో ఆంధ్రప్రదేశ్ లో ఉన్న అతితక్కువ మంది కాంగ్రెస్ నాయకులు చాలా సీరియస్ గానే రియాక్ట్ అవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అవకాశాలకు వేదికగా ఉంటుందని, ఎవరు వచ్చినా పార్టి ఆహ్వానిస్తుందని చెబుతున్నారు. అంతే కాదు కాంగ్రెస్ వంటి పార్టీలో ఎప్పుడు ఎవరు ముఖ్యమంత్రి అవుతారో తెలియదని, అలాంటి అవకాశాలు ఉన్న పార్టిని ఎవ్వరూ వదలుకోరని చెబుతున్నారు. ఇప్పుడు షర్మిల కాంగ్రెస్ లోకి రావటం వలన పార్టికి మేలు కలుగుతుందని అంటున్నారు. అంతే కాదు షర్మిలతో పాటుగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి భార్య విజయమ్మ, షర్మిల భర్త బ్రదర్ అనిల్ కూడా కాంగ్రెస్ లోకి రావాలని పిలుపునిస్తున్నారు. కాంగ్రెస్ పార్టిలో అనేక మంది నాయకులకు గుర్తింపు వచ్చిందని అందులో మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి కూడా ఉన్నారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే వైఎస్, వైఎస్ అంటే కాంగ్రెస్ పార్టిగా ఉన్న రోజుల్లోనే రాహుల్ గాంధీని ప్రధాని చేయాలనే లక్ష్యంతో రాజశేఖర్ రెడ్డి పని చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. మరో వైపున భారత్ జోడో యాత్రతో కాంగ్రెస్ పార్టి అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన యాత్ర తో కాంగ్రెస్ నే వీడిన పాత నేతలంతా తిరిగి కాంగ్రెస్ లోకి రావటానికి ఇష్టపడుతున్నారు. అందులో భాగంగానే వైఎస్ ఫ్యామిలి కూడా కాంగ్రెస్ లోకి ఎంట్రీ ఇవ్వనుందని, ఇందుకు జులై ఎనిమిదో తేదీ, వైఎస్సార్ జయంతి కార్యక్రమాన్ని వేదికగా చేసుకుంటున్నారని చెబుతున్నారు.

## డిజిటల్ ఎనర్జీ మైనింగ్ పేరుతో మోసం

విజయవాడ, జూన్ 28, ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గంలో మరో మోసం బట్టబయలైంది. కొందరు కేటుగాళ్లు డిజిటల్ ఎనర్జీ మైనింగ్ ఆన్‌లైన్ యాప్ పేరుతో ప్రజల్ని మోసం చేశారు . వారిని నమ్మి చైన్ లింక్ పద్ధతిలో ఆన్‌లైన్ యాప్ ద్వారా కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామానికి చెందిన 800 మందికి పైగా సభ్యులు పెట్టుబడులు పెట్టారు . ఒక్క పెండ్యాల గ్రామంలోనే 5 కోట్లకు పైగా లావాదేవీలు చేశారు. చండీగఢ్ నుంచి పెండ్యాల గ్రామానికి చెందిన వ్యక్తి ద్వారా లింక్ రావడంతో నమ్మి పెట్టుబడులు పెట్టారు గ్రామస్తులు. లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే రెండు లక్షలు వస్తాయని నమ్మించారు. ఇంకేముంది.. పెట్టినదానికి డబుల్ వస్తాయనుకుని.. కోట్లలో పెట్టుబడులు పెట్టారు. స్థాయిని బట్టి లావాదేవీలు చేసిన గ్రామస్తులు.. వేలతో మొదలు పెట్టి లక్షల్లోనూ ట్రాన్సాక్షన్లు నిర్వహించారు.మొదట్లో లావాదేవీలు బాగానే నడిచాయి. ఆ తర్వాత డబ్బులు తిరిగి వచ్చే సమయానికి యాప్ పనిచేయకుండా పోయింది. 16వ తేదీ నుంచి డిజిటల్ ఎనర్జీ మైనింగ్ పేరుతోనున్న యాప్ పనిచేయకపోవడంతో తాము మోసపోయినట్లు బాధితులు గుర్తించారు . యాప్ పనిచేయకపోవడంతో పెట్టుబడులు బాధితులు లబోదిబోమని మొత్తుకుంటున్నారు. అధిక డబ్బులు వస్తాయని.. అత్యాశకు పోయి.. నిండా మునిగామంటూ ఆవేదన చెందుతున్నారు. అయితే.. లక్షల్లో నష్టపోయినా.. మోసాన్ని బయటకు చెప్పేందుకు మాత్రం సాహసించడం లేదు బాధితులు. కొందరు మాత్రం.. తమలా మరెవరూ మోసపోవద్దని సూచిస్తున్నారు. ఇక.. డిజిటల్ ఎనర్జీ మైనింగ్ ఆన్‌లైన్ యాప్ నిర్వాహకుల మోసంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. మొత్తంగా.. లోన్ యాప్ మోసాలు నగరాలు, పట్టణాల నుంచి గ్రామాలకు చేరడం కలవరపెడుతోంది.

# ఉభయగోదావరి జిల్లాల కోసం మాస్టర్ ప్లాన్


కాకినాడ, జూన్ 28, వారాహి విజయ యాత్రను ప్రారంభించామని ఈ యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఈ సంకేతాలను పరిశీలిస్తే ప్రజలు మార్పు కోరుకుంటున్నారని బలంగా అర్థమవుతుందన్నారు. 2008 నుంచి రాజకీయ ప్రస్థానంలో ముందుకు వెళున్నామన్నారు. మార్పు వచ్చే వరకు దాన్ని వదలకూడదని పట్టుదలతో ఉన్నానని పవన్ కల్యాణ్ తెలిపారు. ఎన్ని లక్షలు పోసినా సభలకు ఇంత మంది రారని. రాజోలులో స్వచ్ఛందంగా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారన్నారు. మార్పు మొదలైందన్న దానికి ఇదే సంకేతం అని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఇసుక రీచ్‌లో అడ్డగోలుగా జరిగిన దోపిడీ వల్ల పర్యావరణానికి హాని కలుగుతోందని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఆదాయం పోకుండా కాలుష్యాన్ని పారద్రోలాలని, ఉభయ గోదావరి జిల్లాల అభివృద్ధి కోసం ఒక మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. అందులో ముఖ్యమైన అంశం కాలుష్య నివారణ అని. ఆక్వా కల్చర్ వల్ల ఆదాయంతోపాటు ఆపద ఉందన్నారు. ఆదాయం పోకుండా కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నాలు చేయాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.'తూర్పు గోదావరి జిల్లాలో గ్రామాల్లో కూడా నీరు పచ్చగా వస్తోంది. ఇలాంటి పరిస్థితులు కిడ్నీలు లాంటి అవయవాలను దెబ్బతీస్తున్నాయి. ఉద్దానం లాంటి పరిస్థితులు ఉభయ గోదావరి జిల్లాల్లోనూ వచ్చేస్తున్నాయి' అని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉభయ గోదావరి జిల్లాల్లో పచ్చదనం దెబ్బ తినకుండా ప్రజలు ఉపాధి అవకాశాలు కోల్పోకుండా ఆదాయం రావాలని, దాని కోసం మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని జనసేనాని తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఉన్న దివ్య క్షేత్రాలను అనుసంధానం చేసే విధంగా డివోషనల్ సర్క్యూట్ రూట్ ఏర్పాటు చేసి పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. నరసాపురంలో కాలువలు ఉన్నా కేరళ తరహా పర్యాటకం అభివృద్ధి చేయలేకపోతున్నామని, బలమైన వ్యూ ఉంటేనే అది సాధ్యమవుతుందని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు.జనసేన నేతలు, జనసైనికుల ఆత్మగౌరవాన్ని ఎట్టి పరిస్థితుల్లో తాకట్టు పెట్టనని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. మన దగ్గర పెట్టుబడి పెట్టే వారు లేరన్న ఆయన ముఖ్యమంత్రికి , నాయకులకు కాంట్రాక్టులు , అక్రమార్జనలు ఉన్నాయన్నారు. 'నేను ఒక వ్యవస్థ నడుపుతున్నాను. నాకు అలాంటి అక్రమార్జన ఉంటే ముందుకు వెళ్లగలిగేవాడిని కాదు. నేను పార్టీ నడుపుతూ ఇన్నాళ్లు దెబ్బలు తిన్నాను తప్ప మీ ఆత్మగౌరవాన్ని ఎక్కడా తాకట్టు పెట్టలేదు. ఇప్పటి వరకు రాజకీయాల్లో ప్రలోభాలకు చోటివ్వకుండానే ఉన్నాం. ఎన్ని లక్షల కోట్లు ఇచ్చినా ఇంత అభిమానం రాదు. ఇవన్నీ డబ్బుతో కొనేవి కాదు. తెలంగాణ , తమిళనాడు , కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లినా ఇదే స్థాయి అభిమానం ఉంటుంది. ఆ అభిమాన బలంతో ముందుగా ప్రజా సమస్యల పరిష్కారం మీద దృష్టి సారించాను. తర్వాత పార్టీ నిర్మాణం వైపు అడుగులు వేశాం.' అని పవన్ కల్యాణ్ తెలిపారు.జనసేన ప్రభుత్వంలో యూకే తరహా హెల్త్ పాలసీ తీసుకువస్తామన్న పవన్ కల్యాణ్ దీనిపై

లోతుగా అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు. దాతలు ఇచ్చిన కాలేజీ స్థలాలు కూడా అన్యాక్రాంతం అవుతున్నాయని మండిపడ్డారు. పెద్దలు భావితరాల భవిష్యత్తు కోసం ఇచ్చిన భూములు దోచుకుంటున్న వారికి ప్రభుత్వాలు అండగా నిలిచినప్పుడు లక్ష్యాలు దెబ్బతింటాయని చెప్పారు. 'ప్రభుత్వ స్కూళ్లు , కళాశాలలను బలోపేతం చేయాలి. ఉపాధి అవకాశాలు ఉండాలి. ఇక్కడ ఐటీ పరిశ్రమలు లేవు. తెలంగాణలో 1500 , కర్ణాటకలో 2000 ఐటీ హబ్బులు ఉంటే .. మన రాష్ట్రంలో ఆ స్థాయిలో ఎందుకు లేవు. ఇది మన నేల అన్న తపన ఉన్న నాయకులు పూనుకుంటేనే అది సాధ్యపడుతుంది. మనం నోరెత్తకపోతే సమాజం నాశనం అయిపోతుంది. అందుకే నేను ఉభయ గోదావరి జిల్లాల బాధ్యత స్వీకరించాజ.' అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

# తెలంగాణ బీజేపీ కోల్డ్ వార్

హైదరాబాద్, జూన్ 28, (న్యూస్ పల్స్)అసంతృప్తి నేతలను హైకమాండ్ ఢిల్లీకి పిలిచి మాట్లాడుతుంది. అయితే ఢిల్లీ వెళ్లిన ఈటల, కోమటిరెడ్డికి వింత అనుభవం ఎదురైనట్లు తెలుస్తోంది.తెలంగాణలో బీజేపీ ప్లాన్ రివర్స్ అవుతున్నట్లు కనిపిస్తోంది. కర్ణాటక ఫలితాల ప్రభావంతో ఇతర పార్టీల నుంచి బీజేపీ చేరిన నేతలు పక్క చూపులు చూస్తున్నారు. దీంతో పాటు నేతల మధ్య విభేదాలు తలెత్తడంతో బీజేపీ జాతీయ నాయకత్వం రంగంలోకి దిగింది. అసంతృప్తి నేతలను ఢిల్లీకి పిలిచి మాట్లాడుతోంది. ఇప్పటికే ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ఢిల్లీకి పిలిచి సమస్యలపై ఆరా తీసింది. బీఆర్ఎస్ ఎదుర్కొనేందుకు బీజేపీ ప్రస్తుత వ్యూహాలు సరిపోవని తమ సమస్యలను హైకమాండ్ కు వివరించారు. అయితే హైకమాండ్ నుంచి సరైనా స్పందన రాకపోవడంతో నేతలు ఇరకాటంలో పడ్డారు.తెలంగాణ బీజేపీలో ఇంటర్నల్ వార్ నడుస్తోంది. ఇప్పుడు ఈ వివాదం ఢిల్లీ వరకు చేరింది. బీజేపీలోకి భారీగా చేరికలు ఉంటాయని భావించినా ఆ ప్రయత్నాలు సఫలం కాలేదు. పార్టీలో బండి సంజయ్, ఈటల వర్గాలుగా నేతలు విడిపోయారని తెలుస్తోంది. పార్టీలో కొంత మంది బండి సంజయ్ నాయకత్వంపై అసంతృప్తితో ఉన్నారని సమాచారం. తెలంగాణ బీజేపీ చీఫ్ ను మార్చాలని కొందరు నేతలు బీజేపీ హైకమాండ్ కు ఫిర్యాదు చేశారు. పార్టీలో పరిణామాలపైనా రిపోర్టులు ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే బీజేపీ అధినాయకత్వం మాత్రం తెలంగాణ చీఫ్ ను మార్చే యోచనలో లేదని విశ్లేషకులు అంటున్నారు. బీజేపీ హైకమాండ్ చర్యలు తీసుకోకపోవడంతో కొందరు నేతలు ఇతర పార్టీల వైపు చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈటల, కోమటిరెడ్డి బీజేపీ నాయకత్వంపై అసంతృప్తిగా ఉన్నారని ఇటీవల జోరుగా ప్రచారం జరిగింది. బీఆర్ఎస్ పట్ల బీజేపీ హైకమాండ్ మెతకగా వ్యవహరిస్తుందని, తెలంగాణలో అధికారంలోకి రావాలంటే ప్రస్తుత వ్యూహాలు సరిపోవని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్టీ మారాలని తమ అనుచరుల నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయని ఈ నేతలు అంటున్నారు. దీంతో బీజేపీ హైకమాండ్ తో చర్చించి ఫైనల్ నిర్ణయం తీసుకోవాలని ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఢిల్లీలో బీజేపీ అగ్రనేతలతో సమావేశమయ్యారని తెలుస్తోంది. కేటీఆర్ కు అపాయింట్మెంట్ ఇవ్వటం, లిక్కర్ కేసులో కవిత అరెస్ట్ కాకపోవటంతో వెనుక బీఆర్ఎస్, బీజేపీ ఒప్పందం ఉందని కాంగ్రెస్ ఆరోపిస్తుంది. బీఆర్ఎస్ ఓటమే లక్ష్యంగా తాము పార్టీలో చేరామని ఈటల, కోమటిరెడ్డి అంటున్నారు.బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా తెలంగాణలో పర్యటించినా... ఈటల, కోమటిరెడ్డి ఢిల్లీలోనే ఉండిపోయారు. బీజేపీ అగ్రనేతలతో వీరిద్దరూ భేటీ అవుతున్నారు. అయితే బీజేపీ హైకమాండ్ నుంచి ఈ ఇద్దరకు స్పష్టమైన హామీ లభించలేదని తెలుస్తోంది. పార్టీ మారాలని తమపైన ఒత్తిడి ఉందని చెప్పినా బీజేపీ నాయకత్వం పట్టించుకోలేదని సమాచారం. పార్టీ వీడే ఆలోచన మార్చుకోవాలని అధినాయకత్వం చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో ఈటల, కోమటిరెడ్డి భవిష్యత్ నిర్ణయాలపైన మల్లగుల్లాలు పడుతున్నారు. హైకమాండ్ తీరు అంతు చిక్కటం లేదని ఈ నేతలు అంటున్నారని కీలక సమాచారం. అటు వ్యాపారాలు, ఇటు రాజకీయాలు దేనిని పణంగా పెట్టలేక సతమతం అవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు తెలంగాణ కాంగ్రెస్ నేతలు మాత్రం ఘర్ వాపసీపై దృష్టిపెట్టారు. ఢిల్లీలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీతో తెలంగాణ కాంగ్రెస్ నేతలు సమావేశం అయ్యారు. జులై 2న ఖమ్మం సభకు రాహుల్ గాంధీని ఆహ్వానించారు. ఈ సభలో పొంగులేటి, జూపల్లి సహా 35 మంది నేతలు కాంగ్రెస్ లో చేరనున్నారు. ఈ తరుణంలో కొన్నాళ్లు వేచిచూసి నిర్ణయాలు తీసుకోవాలని ఈటెల, కోమటిరెడ్డితో సహా పలువురు నేతలు భావిస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు.

# త్యాగం, విశ్వాసానికి ప్రతీక... బక్రీద్



హైదరాబాద్, జూన్ 28, (న్యూస్ పల్స్)ఈ ఏడాది జూన్ నెలాఖరున ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను జరుపుకొంటున్నారు. ఇస్లాం మతాన్ని విశ్వసించే ప్రజల పండుగలలో బక్రీద్ ముఖ్యమైనది. త్యాగానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకొంటారు. ఇస్లాం సంప్రదాయం జిల్హిజ్ మాసంలో చంద్ర దర్శనం అనంతరం బక్రీద్ పండుగ జరుపుకుంటారు. ఈ సంవత్సరం మన దేశంలో ఈద్ ఉల్-అదా అంటే బక్రీద్ జూన్ 29వ తేదీ గురువారం నిర్వహిస్తుండగా.. సౌదీ అరేబియాలో జూన్ 28న ఈద్ ఉల్-అధా జరుపుకొంటున్నారు. ఇస్లాంలో, ఈ రోజున త్యాగానికి ప్రత్యేక ప్రాముఖ్యం ఇచ్చారు. బక్రీద్ పండుగ ప్రాముఖ్యం, ఈ పండుగ విశిష్టత గురించి తెలుసుకోండి.ఇస్లాం మత పెద్దల అభిప్రాయం ప్రకారం, ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం మొహమ్మద్ తనను తాను దేవుని ఆరాధనకు అంకితం చేసుకున్నాడు. అతని ఆరాధన పట్ల అల్లా ఎంతగానో సంతోషించాడు. ఒకరోజు అల్లా ప్రవక్త హజ్రత్ ఇబ్రహీంను పరీక్షించాలని నిర్ణయించుకున్నాడు. ఇబ్రహీం వద్దకు వచ్చి, నీకు అత్యంత ప్రియమైన లేదా అత్యంత విలువైన వస్తువును త్యాగం చేయమని అడిగాడు, అప్పుడు ఇబ్రహీం తన సొంత కుమారుడిని బలి ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. అప్పుడు అల్లా ఇతను నీ కుమారుడు కదా అని అడిగాడు.అప్పుడు ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం మొహమ్మద్ తన కుమారుని కంటే తనకు ప్రియమైనది కానీ, విలువైనది కానీ ఏదీ లేదని చెప్పాడు. అతన్ని త్యాగం చేయడానికి ముందుకొచ్చాడు. అతను తన కొడుకును బలి ఇవ్వాలనుకున్న వెంటనే, అల్లా ఇబ్రహీం కొడుకు స్థానంలో ఒక గొర్రెను ఉంచాడు, అతని కుమారుడిని మళ్లీ అతనికి అప్పగించాడు. బలి ఇచ్చే స్థలంలో గొర్రెను చూసి ఆశ్చర్యపోయిన ఇబ్రహీం తన కొడుకు గురించి అల్లాను ఆరా తీస్తాడు. అప్పుడు, అల్లా నాపై నీ కళంకమైన భక్తిని చూసి, నేను ఓడిపోయాను. నీ భక్తికి నేను సంతోషిస్తున్నాను అని ఇబ్రహీం కుమారుడిని అతని వద్దకు తిరిగి ఇస్తాడు. అప్పటి నుంచి బక్రీద్ పండుగను జరుపుకోవడం మొదలైంది. బక్రీద్ పండుగలో గొర్రెలను బలి ఇచ్చే సంప్రదాయం పుట్టింది.ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం, జిల్హిజ్ నెలను సంవత్సరంలో చివరి నెలగా భావిస్తారు. ఈ నెలలో మొదటి రోజు ముస్లిం సోదరులకు చాలా ముఖ్యమైనది. ఈ రోజు చంద్రుని దర్శనంతో, బక్రీద్ లేదా ఈద్ ఉల్-అదాను ప్రకటిస్తారు. చంద్రుడు దర్శనమిచ్చిన పదవ రోజున బక్రీద్ పండుగ జరుపుకొంటారు. ఇస్లామిక్ విశ్వాసాల ప్రకారం, ఈద్-ఉల్-అదా ఇస్లామిక్ క్యాలెండర్ చివరి నెలలో జరుపుకొంటారు. ఈద్ తర్వాత రెండు నెలల తర్వాత బక్రీద్ జరుపుకుంటారు. బక్రీద్ ఇస్లాంలో త్యాగానికి చిహ్నంగా పరిగణిస్తారు. బక్రీద్ నాడు, ఈద్-ఉల్-ఫితర్ నాడు అంటే, ఈద్ పండుగ రోజున గొర్రెలను బలి ఇచ్చి, ఖీర్ తయారు చేసి, పొరుగువారికి పంపిణీ చేస్తారు.ముస్లిం సోదరులు ఈ రోజు ఈద్గాలు, మసీదుల్లో ప్రార్థనలు చేస్తారు. బక్రీద్ రోజు ఉదయం నమాజ్ చేయడంతో ఈ పండుగ ప్రారంభమవుతుంది. ఈ సంతోషకరమైన సందర్భాలలో పేదలకు సహాయం చేయాలని ఇస్లాంలో పేర్కొన్నారు. బక్రీద్ బక్రీద్ పండుగ రోజున ఏ జంతువును బలి ఇచ్చినా దాని మాంసాన్ని మూడు భాగాలుగా కోయాలి. ఈ 3 భాగాలలో కొంత భాగాన్ని పేదలకు పంచాలి. రెండవ భాగాన్ని బంధువులకు పంచి, మూడవ భాగాన్ని ఇంటి వారు ఉపయోగించాలనే సంప్రదాయం ఉంది. బక్రీద్ ముస్లిం సమాజానికి పవిత్రమైన పండుగ, ఇబ్రహీం త్యాగం, అల్లాకు విశ్వాసుల భక్తిని గుర్తుచేసే రోజు.

# ఈటల భద్రతపై ప్రభుత్వం ఆరా

హైదరాబాద్, జూన్ 28, (న్యూస్ పల్స్)భద్రతకు ముప్పు ఉందని ఈటల రాజేందర్ చేసిన కామెంట్స్ తెలంగాణలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. తనకు బెదిరింపులు వస్తున్నాయని ఈటల అంటే.. తన భర్తను చంపే కుట్ర జరుగుతోందన్నారు. దీని కోసం సుపారీ కూడా ఇస్తున్నారని ఆరోపణలు చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్సీ కేంద్రంగానే వాళ్లీ ఆరోపణలు చేశారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధిపై తీవ్ర ఆరోపణలు రావడంతో ప్రభుత్వం అలర్ట్ అయింది. వెంటనే ఈటల భద్రతపై రివ్యూ చేపట్టాలని అధికారులను ఆదేశించింది. వెంటనే కలుగుజేసుకున్న డీజీపీ... మేడ్చల్ డీసీపీ సందీప్‌రావుకు స్పెషల్ టాస్క్ ఇచ్చారు. డీజీపీ ఆదేశాల మేరకు స్పందించిన సందీప్‌రావు ఈటల రాజేందర్‌ను కలిసేందుకు ఆయన ఇంటికి వెళ్లారు. అయితే అప్పటికే ఈటల బయటకు వెళ్లిపోయారని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఆయన తిరిగి వచ్చేశారు. ఈటల వచ్చిన తర్వాత మరోసారి వెళ్లి ఆయనతో మాట్లాడనన్నారు. వివరాలు తీసుకొని డీజీపీకి రిపోర్ట్ చేయనున్నారు. మంగళవారం ఈటల రాజేందర్ సతీమణి జమున హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిపై సంచలన ఆరోపణలు చేశారు. ఈటల రాజేందర్‌ను చంపేందుకు కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.20 కోట్లు ఇచ్చి ఈటలను చంపిస్తానంటూ కౌశిక్ రెడ్డి అన్నట్లు తమకు తెలిపిందని కామెంట్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రోత్సాహంతోనే కౌశిక్ రెడ్డి చెలరేగిపోతున్నారని ఆరోపించారు. తమ కుటుంబసభ్యులకు ఒక్క రక్తపు బొట్టు కింద పడ్డా దానికి సీఎం కేసీఆర్‌దే బాధ్యతని అన్నారు. కౌశిక్ రెడ్డి లాంటి ఓ పిచ్చికుక్కను ఎమ్మెల్సీని చేసి సీఎం కేసీఆర్ హుజూరాబాద్ ప్రజల మీదకు వదిలారని ఘాటుగా వ్యాఖ్యానించారు జమున. పిచ్చికుక్క అరాచకాలు పెరిగిపోయాయని, నియోజకవర్గ ప్రజలు, మహిళల పట్ల ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆ తర్వాత ప్రెస్ మీట్ పెట్టిన ఈటల కొన్ని నెలలుగా తనకు బెదిరింపులు వస్తున్నాయని చెప్పారు. ఎలాంటి బెదిరింపులకు భయపడేవాడిని కానన్నారు. నయీమ్ కే భయపడలేదని గుర్తు చేశారు. ఈ బెదిరింపులకు భయపడతానా అని ప్రశ్నించారు. తనతో పెట్టుకుంటే మాడిమసైపోతారని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల హెచ్చరించారు.

# కాంగ్రెస్ గూటికి చంద్రశేఖర్

వికారాబాద్, జూన్ 28, (న్యూస్ పల్స్)వికారాబాద్ నియోజకవర్గం నుంచి రికార్డు స్థాయిలో వరుసగా 5 సార్లు ఎమ్మెల్యేగా గెలిచి డాక్టర్ ఏ చంద్రశేఖర్ రికార్డు సృష్టించారు. మొదటిసారి 1985లో తెలుగుదేశం పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి గెలిచిన చంద్రశేఖర్, వికారాబాద్ నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా ఎదిగాడు. 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసి వరుసగా 4 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాడు. అనంతరం 2001లో మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభ సమయంలో కేసీఆర్ పిలుపుతో బీఆర్ఎస్ పార్టీలోకి వచ్చి 2004 సాధారణ ఎన్నికల్లో కూడా గెలిచి, వరుసగా 5 సార్లు గెలిచిన ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించాడు. ఆ సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో దివంగత సీఎం రాజశేఖర్ రెడ్డి హయాంలో మంత్రిగా కూడా పనిచేశారు.తెలంగాణ వ్యూహంలో భాగంగా 2008లో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం, అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్ కుమార్ చేతిలో ఓటమి పాలయ్యాడు. 2009లో జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యాడు. డాక్టర్ ఏ చంద్రశేఖర్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత తెలంగాణ రాష్ట్ర సమితికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరాడు. 2014లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేయలేదు. 2018లో కాంగ్రెస్ పార్టీ టికెట్ దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా సింహం గుర్తుపై పోటీ చేసిన ఏసీఆర్, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్ కుమార్, బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్ మధ్య పోటీలో ఓటమిపాలయ్యారు. కేవలం మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఓడించాలనే ఉద్దేశంతోనే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశానని నాడు ఏసీఆర్ స్టేట్‌మెంట్ కూడా ఇచ్చారు. అనంతరం చేసేది లేక 2021లో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి భారతీయ జనతా పార్టీలో చేరాడు.ప్రస్తుతం బీజేపీ పార్టీలో కొనసాగుతున్న ఏసీఆర్, పార్టీలో ఉన్నా లేనట్లేనా? అన్నట్లుగా చర్చలు నడుస్తున్నాయి. బీజేపీ పార్టీలో కొనసాగుతున్నా కేవలం నామమాత్రంగా మాత్రమే పనిచేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తుందని చర్చలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయ పార్టీ బీజేపీ తప్ప మరో పార్టీ లేదు అనే టాక్ రావడంతో ఆ పార్టీలో చేరిన ఏసీఆర్ కన్ఫ్యూజన్‌లో పడ్డాడు అనే చర్చ నడుస్తోంది. 2021లో కాంగ్రెస్ తెలంగాణాలో భూస్థాపితం అవుతుంది అనేలా సంకేతాలు వచ్చినా, ప్రస్తుతం రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ రోజు రోజుకు పుంజుకుంటుంది.పైగా

రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్‌పై ప్రజల్లో సెంటిమెంట్ ఉంది. మరోపక్క సీఎం కేసీఆర్ పాలనపై వ్యతిరేకత కూడా రోజు రోజుకు పెరుగుతుండడంతో చంద్రశేఖర్ చూపు కాంగ్రెస్‌పై పడిందనే టాక్ వినిపిస్తుంది. కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉన్న సమయంలో కూడా మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ పార్టీని వీడకుండా, అధికార పార్టీ నుంచి ఆహ్వానం వచ్చినా వెళ్లకుండా నమ్మకంగా ఉన్న కారణంగా ఈ సారి వికారాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా గడ్డం ప్రసాద్ కుమార్‌నే అధిష్టానం ఫైనల్ చేసింది.దాంతో ఏసీఆర్ ఈసారి ప్రసాద్ కుమార్‌ను డిస్టర్బ్ చేయకుండా ఆనయ గెలుపు సహకరిస్తూ మరో నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్నాడని, త్వరలోనే మళ్లీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోనున్నాడనే చర్చ నడుస్తుంది. ఇందులో భాగంగా చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా లేదా మరో చోటు నుంచి పోటీ చేసే అవకాశం ఉందని టాక్ నడుస్తోంది. ఇదిలా ఉంటే తన ప్రధాన శత్రువు కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడించడమే లక్ష్యంగా కంకణం కట్టుకున్న ఏసీఆర్, ఆ లక్ష్యం నెరవేరాలంటే ఏ పార్టీలో ఉండాలి అనే అంశంలో సతమతం అవుతున్నారని టాక్. మరి ఇంతకు మాజీ మంత్రి చంద్రశేఖర్ దారి ఎటు? అయన వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ నుంచి, ఏ నియోజకవర్గంలో పోటీ చేస్తాడో తెలియాలి అంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

# కర్ణాటక సర్కార్ ప్రభుత్వంలో లుకలుకలు

## నేను సీఎంలా బ్యాక్ స్టెప్ వేయనంటున్న డిప్యూటీ సీఎం

బెంగళూరు, జూన్ 28, (న్యూస్ పల్స్) కర్ణాటక డిప్యుటీ సీఎం డీకే శివకుమార్..ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నో రోజులుగా వివాదాస్పదం అవుతున్న స్టీల్ ఫ్లై ఓర్ ప్రాజెక్ట్ విషయంలో ప్రజల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. అందుకే సిద్దరామయ్య ఈ ప్రాజెక్ట్‌పై వెనక్కి తగ్గాలని చూస్తున్నారు. ఈ క్రమంలోనే డీకే శివకుమార్ సిద్దరామయ్యకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. "ప్రజలు ఎంత ఒత్తిడి చేసినా తాను సిద్దరామయ్య లాగా భయపడే వాడిని కాదు" అని అన్నారు. విధాన సౌధలో కెంపెగౌడ జయంతి సందర్భంగా ఓ కీలక భేటీలో పాల్గొన్నారు డీకే శివ కుమార్. ఆ సమయంలోనే రాష్ట్రంలో చేపట్టాల్సిన పలు ప్రాజెక్టులు ప్రస్తావనకు వచ్చాయి. బెంగళూరులో ఫ్లై ఓవర్‌లు, టన్నెల్స్ నిర్మించాలన్న ప్రతిపాదన వచ్చింది. గతంలో సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్ట్ ప్రస్తావన రాగా...ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందని భావించిన సిద్దరామయ్య వెంటనే దాన్ని పక్కన పెట్టారు. దీన్ని ప్రస్తావిస్తూనే డీకే ఇలా మాట్లాడారు. పైగా...ఇప్పుడాయన బెంగళూరు సిటీ డెవలప్‌మెంట్ మినిస్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఈ కామెంట్స్ చేయడం సంచలనమవుతోంది. "గతంలో సిద్దరామయ్య ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు స్టీల్ బ్రిడ్జ్ కట్టాలని భావించారు. కానీ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ ప్రాజెక్ట్‌లో అవినీతి జరుగుతోందన్న ఆరోపణలూ వచ్చాయి. దీంతో సిద్దరామయ్య భయపడిపోయారు. అప్పటి బెంగళూరు సిటీ డెవలప్‌మెంట్ మినిస్టర్ కేజే జార్జ్ కూడా వెనక్కి తగ్గారు. ఇద్దరూ కలిసి ఆ ప్రాజెక్ట్‌ని అటకెక్కించారు. ఒకవేళ అప్పుడు సిద్దరామయ్య ప్లేస్‌లో నేను ఉండి ఉంటే అసలు భయపడే వాడిని కాదు. నా దారిలో ఎవరు అడ్డం వచ్చినా ఆ అడ్డు తొలగించుకునే వాడినిఇదే సమయంలో ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన కీలక వివరాలు వెల్లడించారు డీకే శివకుమార్. బసవేశ్వర సర్కిల్ నుంచి హెబ్బాల్ జంక్షన్ వరకూ దాదాపు 6-7 కిలోమీటర్ల మేర ఈ స్టీల్ బ్రిడ్జ్‌ని నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకోసం రూ.1,761 కోట్ల ఖర్చవుతుందని అంచనా వేశారు. అయితే..ఇందు కోసం దాదాపు 800 చెట్లను నరికేయాల్సి వస్తుందని అధికారులు వెల్లడించారు. ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవడం వల్ల వెంటనే అప్పటి సిద్దరామయ్య ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఇప్పుడు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఈ ప్రాజెక్ట్ పూర్తి చేసి తీరతానని స్పష్టం చేశారు డీకే శివకుమార్. ఎవరు అడ్డం వచ్చినా ఆగనని తేల్చి చెప్పారు. సిటీలోని రోడ్లపైనా దృష్టి సారించి ఆ సమస్యకూ పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. వీటితో పాటు నగర శివార్లలో శాటిలైట్ సిటీలనూ నిర్మించాలని ప్లాన్ చేస్తోంది సిద్దరామయ్య ప్రభుత్వం. బెంగళూరుపై ఒత్తిడి తగ్గించేందుకు..శివార్లలో ప్రత్యేకంగా విల్లాలు నిర్మించి అక్కడా మొబిలిటీ పెంచాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించిన మ్యాప్‌నీ సిద్ధం చేసినట్టు సమాచారం.

# పవన్ నాకు అన్న లాంటి వాడు

హైదరాబాద్, జూన్ 28, (న్యూస్ పల్స్)ఏపీ రాజకీయాలపై మంత్రి కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ ఏపీలోనూ పోటీచేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ మాత్రమే ఏపీ ప్రయోజనాలను కాపాడగలరని చెప్పుకొచ్చారు. ప్రజలు అనుకుంటే ఏదైనా జరుగుతుందన్నారు. సీఎం జగన్ జగన్, లోకేశ్, పవన్ తో తనకు ఉన్న సంబంధాల గురించి వివరించారు. మోడీ అయినా.. మరెవరైనా భయపడే ప్రసక్తే లేదని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. కేంద్రంలో కీలక పాత్ర పోషిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పేర్కొన్నారు. తెలంగాణ మంత్రి కేటీఆర్ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో పవన్ కళ్యాణ్ గురించి కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అవి కాస్త నెట్టింట్లో వైరల్ అయ్యాయి.. తనకు పవన్ మంచి ఫ్రెండ్ గా కేటీఆర్ పేర్కొన్నారు. తనకు అన్న లాంటి వాడని చెప్పారు.పలు సందర్భాల్లో కలుసుకున్నామని.. అనేక విషయాలు మాట్లాడుకున్నామని వెల్లడించారు. అనేక అంశాల్లో తమ అభిరుచులు కలుస్తాయని కేటీఆర్ వివరించారు. పవన్ కు సాహిత్యం అంటే ఇష్టమని చెప్పిన కేటీఆర్?తనకు కూడా సాహిత్యం అంటే కొంత ఆసక్తి ఉందన్నారు. తనకు అందరూ స్నేహితులేనని కేటీఆర్ చెప్పుకొచ్చారు. రాజకీయాలకు..స్నేహలకు సంబంధం లేదన్నారు. ఎవరి రాజకీయాలు వారివి.. ఆయన రాజకీయాలు ఆయనవి.. నా రాజకీయాలు నావి.. ఏపీలో నారా లోకేష్ కూడా బాగా తెలుసు.. జగనన్న కూడా మంచి ఫ్రెండ్.. నాకు అందరు స్నేహితులే.. ఎవరితో ఎలాంటి ఇబ్బందులు లేవు.. అంటూ రాజకీయాలు రాజకీయాలే.. మా స్నేహాలు మావే అన్నట్టు కేటీఆర్ చెప్పుకొచ్చారు. ఇక కేటీఆర్ మాట్లాడుతూ మా పార్టీ కూడా ఏపీలో పోటీ చేస్తుందని.. బీజేపీని వ్యతిరేకించే గొంతు బీఆర్ఎస్ కు మాత్రమే ఉందన్నారు. సీఎం కేసీఆర్ మాత్రమే ఏపీ ప్రయోజనాలను కాపాడగలరన్నారు.

# 57 శాతం మంది ఫస్ట్ ఛాయిస్ మోడీకే

న్యూఢిల్లీ, జూన్ 28, (న్యూస్ పల్స్)2024 లోక్‌సభ ఎన్నికలు జరిగే ముందు ఈ ఏడాది పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆ లిస్ట్‌లో మధ్యప్రదేశ్ కూడా ఉంది. ఇప్పటికే అన్ని పార్టీలూ ఎన్నికలకు సిద్ధమయ్యాయి. ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా అక్కడ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. "మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్" అనే ప్రోగ్రామ్‌నీ మొదలు పెట్టారు. అయితే..మధ్యప్రదేశ్ ఓటర్లు ఎవరివైపు మొగ్గు చూపుతారన్న ఆసక్తి ఇప్పటికే మొదలైంది. దీనిపైనే ఏబీపీ సి ఓటర్ సర్వే ఓ ఒపీనియన్ పోల్ నిర్వహించింది. రకరకాల అంశాలపై అభిప్రాయాలు సేకరించిన ఈ సర్వే...ఓ ఆసక్తిర పోల్ చేపట్టింది. 2024 ఎన్నికల్లో ఎవరిని ప్రధాని అభ్యర్థిగా ఎన్నుకుంటారు..? అని ప్రశ్నించింది. వీరిలో నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ, యోగి ఆదిత్యనాథ్, అరవింద్ కేజ్రీవాల్ పేర్లు ప్రధానంగా ఉన్నాయి. వీరిలో ఎవరు వచ్చే ఎన్నికల్లో ప్రధానిగా నిలబడాలని అనుకుంటున్నారని ప్రశ్నించగా ఆసక్తికర సమాధానాలు చెప్పారు ఓటర్లు. ఈ సర్వేలో దాదాపు 57% మంది నరేంద్ర మోదీకే ఓటు వేశారు. ప్రధాని అభ్యర్థిగా ఆయనే తమ ఫస్ట్ ఛాయిస్ అని తేల్చి చెప్పారు. ఈ రేసులో ఉన్న రాహుల్ గాంధీకి కూడా కొంత మద్దతు లభించింది. ఆయనకు 18% మంది ఓటు వేశారు. రాహుల్ ప్రధాని అవ్వాలని అభిప్రాయపడ్డారు. ఇక యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పీఎం రేసులో ఉన్నారని ఎప్పటి నుంచో వార్తలు వినిపిస్తున్నాయి. మోదీ తరవాతి ప్రధాని ఆయనే అన్న ఊహాగానాలూ మొదలయ్యాయి. ఈ క్రమంలోనే ఈ సర్వేలో ఊహించని ఫలితాలు వచ్చాయి. యోగి ఆదిత్యనాథ్ ప్రధాని అభ్యర్థిగా ఉండాలని కేవలం 8% మంది మాత్రమే భావించారు. ఇక అరవింద్ కేజ్రీవాల్‌కి 3% మంది ఓటు వేశారు. ఇతరులకు 14% మేర ఓట్లు దక్కాయి. నరేంద్ర మోదీ - 57%రాహుల్ గాంధీ - 18%యోగి 3%ఇతరులు - 14%ఇదే ఒపీనియన్ పోల్‌లో మరో అంశంపైనా సర్వే జరిగింది. ఒకవేళ ప్రధానిని నేరుగా ఎన్నుకోవాల్సిన అవకాశం వస్తే ఎవరికి మొగ్గు ఎక్కువగా ఉంటుందని సర్వే నిర్వహించారు. ఇందులోనూ నరేంద్ర మోదీకే ఎక్కువ ఓట్లు దక్కాయి. దాదాపు 68% మంది ఓటర్లు "మాకు ప్రధానిని ఎన్నుకునే అవకాశం వస్తే మోదీనే ఎన్నుకుంటాం" అని తేల్చి చెప్పారు.

# వరుసగా ఏడు ఓవర్లు బౌలింగ్.. పూర్తిగా కోలుకున్నట్లేనా!



ఐసీసీ ప్రతిష్టాత్మక వన్డే వరల్డ్‌కప్‌కు మరో 99 రోజులు మిగిలిఉంది. భారత్ ఆతిథ్యమిస్తున్న వన్డే వరల్డ్‌కప్‌కు సంబంధించిన షెడ్యూల్‌ను ఐసీసీ మంగళవారం రిలీజ్ చేసింది. అక్టోబర్ 5 నుంచి నవంబర్ 19 వరకు జరగనున్న మెగాటోర్నీలో పది స్టేడియాల్లో 48 మ్యాచ్‌లు, రెండు సెమీఫైనల్స్, ఒక ఫైనల్ జరగనున్నాయి. ఇక వరల్డ్‌కప్‌కు బీసీసీఐ టీమిండియా బెస్ట్ టీంను ఎంపిక చేసే పనిలో ఉంది. వెస్టిండీస్, ఐర్లాండ్‌తో వరుసగా టీమిండియా వన్డే సిరీస్‌లు ఆడనుంది. ఆ తర్వాత ఆసియా కప్‌లో పాల్గొంటుంది. ఈ టోర్నీలో ఆటగాళ్లు చేసే ప్రదర్శన ద్వారా తుది జట్టుపై ఒక అంచనాకు రానున్నారు. ఇకపోతే గాయాలతో దూరమైన కేఎల్ రాహుల్, రిషబ్ పంత్, శ్రేయాస్ అయ్యర్, పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాలు కూడా వరల్డ్‌కప్ ఆడాలనే ఉత్సాహంతో త్వరగా కోలుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఈ మేరకు వీరంతా ఎన్‌సీఏ అకాడమీలోని రీహాబిలిటేషన్ సెంటర్‌లో వేగంగా కోలుకుంటున్నారు. టీమిండియాకు ప్రధాన పేసర్ అయిన బుమ్రా పూర్తిగా కోలుకున్నట్లు తెలుస్తోంది. ఎన్సీఏలో రిహాబిలిటేషన్ పొందుతున్న బుమ్రా.. వరుసగా ఏడు ఓవర్ల పాటు బౌలింగ్ చేసినట్లు సమాచారం. సర్జరీ తర్వాత కొన్నాళ్లు విశ్రాంతి తీసుకున్న బుమ్రా.. గత కొంతకాలంగా ఎన్సీఏలోనే గడుపుతున్నాడు. ఫిట్‌నెస్‌ను మెరుగుపరుచుకుంటున్న అతడు.. ఈ క్రమంలోనే ఏడు ఓవర్ల పాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా బౌలింగ్ చేసి అందర్నీ ఆశ్చర్యపరిచాడని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. ఇదే విషయమై బీసీసీఐ ప్రతినిధి మాట్లాడుతూ.. 'ఒక ఫాస్ట్ బౌలర్ గాయం నుంచి కోలుకోవడం అంత సామాన్యమైన విషయమైతే కాదు. మేం బుమ్రా విషయంలో నిత్యం మానిటరింగ్ చేస్తున్నాం. అతడు వేగంగా కోలుకోవడమే గాక ఫిట్‌నెస్‌ను కూడా మెరుగుపరుచుకుంటున్నాడు. నెట్స్‌లో ఇవాళ వరుసగా ఏడు ఓవర్ల పాటు బౌలింగ్ చేశాడు. క్రమంగా అతడు మరిన్ని ఓవర్లు వేసేందుకు సిద్ధమవుతున్నాడు. వచ్చే నెలలో అతడు కొన్ని ప్రాక్టీస్ మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. అక్కడ ఎలా ఆడతాడో చూశాక బుమ్రా ఫిట్‌నెస్‌పై ఒక స్పష్టత వస్తుంది. ఆ తర్వాతే అతడు ఐర్లాండ్‌తో ఆగస్టులో ఆడతాడో లేదో అనే దానిపై ఒక అంచనాకు రావొచ్చు"అని పేర్కొన్నాడు. ఇక రిషభ్ పంత్, కెఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్ లతో పాటు బుమ్రాను ఆగస్టులో జరిగే ఆసియా కప్ వరకైనా సిద్ధం చేయాలనే లక్ష్యం పెట్టుకున్న బీసీసీఐ ఆ మేరకు ప్రణాళికలు కూడా రెడీ చేసింది. ఆసియా కప్ కంటే ముందే ఐర్లాండ్ తో భారత్ టీ20 సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ లో బుమ్రాను పరీక్షించి ఆసియా కప్.. ఆ తర్వాత వన్డే వరల్డ్ కప్ కు సిద్ధం చేయాలని బీసీసీఐ భావిస్తోంది.

# 2011 నుంచి ఆతిథ్య జట్టుదే.. ఈ లెక్కన వరల్డ్‌కప్ మనదేనా అంటూ జోస్యం!




మనలో సైన్స్ తెలిసినోళ్లు జోతిష్యం గుడ్డిగా నమ్మరు. అది అలా చేస్తేనే జరుగుతుంది... ఇది ఇలా చేస్తేనే జరుగుతుంది అని కొంతమంది చేసే వితండవాదాన్ని సైన్స్‌ను నమ్మేటోళ్లు కొట్టిపారేయడం చూస్తుంటాం. కానీ కొన్ని విషయాలు మాత్రం మనల్ని నమ్మించేలా ఉంటాయి. క్రీడలు కూడా అందుకు అతీతం కాదని చెప్పొచ్చు. ఇలాంటివి ఫుట్‌బాల్‌లో చూశాం. గతంలో 2010 ఫిఫా వరల్డ్‌కప్ సమయంలో ఒక ఆక్టోపస్‌ను తీసుకొచ్చి ఏ జట్టు గెలుస్తుందో చెప్పమంటే అది స్పెయిన్ జెండాను ముట్టుకుంది. నిజంగానే ఆ ఏడాది స్పెయిన్ విశ్వవిజేతగా నిలిచింది. అంతకముందు ఇటలీ 2006లో విశ్వవిజేతగా నిలిచింది. ఈ రెండు సందర్భాల్లో ఆక్టోపస్ జోస్యం నిజం కావడంతో దానిని అదృష్ట దేవతగా పిలవడం మొదలెట్టారు. తాజాగా ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ విషయంలోనూ ఒక విషయం టీమిండియాదే ఈసారి వరల్డ్‌కప్ అని జోస్యం చెబుతుంది. అదేంటంటే 2011 నుంచి చూసుకుంటే వరల్డ్‌కప్‌కు ఆతిథ్యమిచ్చిన దేశాలే విజేతగా నిలుస్తూ వస్తున్నాయి. 2011లో టీమిండియా రెండోసారి విజేతగా అవతరిస్తే.. 2015లో మెగా టోర్నీకి ఆతిథ్యమిచ్చిన ఆస్ట్రేలియా ఐదోసారి వరల్డ్‌కప్ విజేతగా నిలిచింది. ఇక 2019లోనూ సేమ్ సీన్ రిపీట్ అయింది. ఈ వరల్డ్‌కప్‌కు ఇంగ్లండ్ ఆతిథ్యమిచ్చింది. ఫైనల్లో న్యూజిలాండ్‌ను బౌండరీ కౌంట్ తేడాతో ఓడించి ఇంగ్లండ్ తొలిసారి విశ్వవిజేతగా నిలిచింది. ఈ లెక్కన 2023 వన్డే వరల్డ్‌కప్‌కు ఆతిథ్యమిస్తున్న భారత్ ఈసారి వరల్డ్‌కప్‌ను కొల్లగొట్టబోతుందని కొంతమంది అభిమానులు జోస్యం చెబుతున్నారు. ఒకవేళ ఇది నిజమయితే మాత్రం టీమిండియా ముచ్చటగా మూడోసారి వరల్డ్‌కప్ కొట్టడం ఖాయం. కానీ పరిస్థితులు అలా కనిపించడం లేదు. టీమిండియా ఫేవరెట్‌గా ఉన్నా ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లు ఏ దేశమైనా చెలరేగి ఆడడం వారి నైజం. అందునా ఆస్ట్రేలియా జట్టు మరోసారి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించడం మొదలుపెట్టింది. ఇటీవలే డబ్ల్యూటీసీ చాంపియన్‌షిప్ గెలిచి ఉత్సాహంతో ఉన్న ఆసీస్ భారత్ గడ్డపై వన్డే వరల్డ్‌కప్ గెలవాలన్న కసితో ఉంది. మరోవైపు ఇంగ్లండ్ కూడా డిపెండింగ్ చాంపియన్ హోదాను నిలబెట్టుకోవాలనే దృఢ సంకల్పంతో ఉంది. అటు వరుసగా రెండుసార్లు రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్ మాత్రం ఈసారి కప్ కొట్టాలనే సంకల్పంతో బరిలోకి దిగుతుంది. ఇక రోహిత్ సారధ్యంలోని టీమిండియా పేపర్‌పై బలంగా కనిపిస్తోంది. కోహ్లి సహా మిగతా ఆటగాళ్లు సమిష్టిగా రాణిస్తే టీమిండియాకు విజేతగా నిలవడం పెద్ద కష్టమేమి కాదు. కానీ ఎంతవరకు నిలకడ ఉ ందనేది క్లారిటీ లేదు. అయినా సరే మెగా టోర్నీకి మనం ఆతిథ్యం ఇస్తున్నాం కాబట్టి టీమిండియా మూడో వరల్డ్‌కప్ గెలవాలని కోరుకుందాం.

# వన్డే ప్రపంచ కప్ వేదికలపై 'రాజకీయ రంగు'.. స్పందించిన బీసీసీఐ ఉపాధ్యక్షుడు



అక్టోబర్ 5వ తేదీ నుంచి భారత్ వేదికగా వన్డే ప్రపంచకప్ 2023 ప్రారంభం కానుంది. ఇప్పటికే షెడ్యూల్‌ను ఐసీసీ ప్రకటించింది. మొత్తం 12 వేదికలను ఇందుకోసం ఎంపిక చేశారు. అందులో రెండింట్లో వార్మప్ మ్యాచ్‌లను నిర్వహిస్తారు. మిగతా 10 వేదికల్లో ప్రపంచకప్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ క్రమంలో వరల్డ్ కప్ షెడ్యూల్‌లో మొహాలీకి చోటు కల్పించకపోవడంపై రాజకీయ రంగు పులుముకుంది. పంజాబ్ క్రీడల మంత్రి గుర్మీత్ సింగ్ తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పందించారు. ఐసీసీ స్టాండర్డ్స్‌కు మొహాలీ వేదిక సరితూగలేదని, తమ చేతుల్లో ఎలాంటి నిర్ణయం ఉండదని వ్యాఖ్యానించారు. అందుకే అవకాశం కల్పించలేకపోయినట్లు పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 12 వేదికలను వార్మప్ సహా ప్రపంచకప్ మ్యాచ్‌ల కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు."ప్రపంచ కప్ కోసం తొలిసారి పన్నెండు వేదికలను ఎంపిక చేశాం. ఇందులో చాలా వేదికలు గత ప్రపంచ కప్‌ల కోసం ఎంపిక కాలేదు. ఈ 12 వేదికల్లో తిరువనంతపురం, గువాహటి స్టేడియాల్లో వార్మప్ మ్యాచ్‌లు జరుగుతాయి. మిగతావన్నీ లీగ్‌లు, నాకౌట్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తాయి. మరిన్ని వసతులను కల్పించడంతోనే వాటికి అవకాశం వచ్చింది. సౌత్ జోన్ నుంచి నాలుగు, సెంట్రల్ జోన్ నుంచి ఒకటి, వెస్ట్ జోన్ నుంచి రెండు, నార్త్ జోన్ నుంచి రెండు వేదికలను ఎంపిక చేశాం. అలాగే ఢిల్లీ, ధర్మశాలలోనూ మ్యాచ్‌లు జరుగుతాయి. మ్యాచ్‌లను కేటాయించడంపై ఏ వేదికపైనా వివక్షత చూపలేదు. ద్వైపాక్షిక సిరీస్ మ్యాచ్‌లను మొహాలీ వేదికగానే నిర్వహించాం. ఇంకా జరుగుతాయి. విరాట్ కోహ్లీ వందో టెస్టు మ్యాచ్ కూడా మొహాలీలో జరిగింది. మొహాలీలోని మల్లాన్‌పూర్ స్టేడియం సిద్ధమవుతోంది. ఒకవేళ రెడీగా ఉండుంటే వరల్డ్ కప్ మ్యాచ్‌కు వేదికయ్యే పరిస్థితి ఉండేది. ఇప్పుడున్న మైదానం ఐసీసీ స్టాండర్డ్స్‌కు తగ్గట్టుగా లేదు. అందుకే ఈసారి అవకాశం రాలేదు. ద్వైపాక్షిక సిరీస్ మ్యాచ్‌లను కేటాయించాం. వరల్డ్ కప్ కోసం మైదానాల ఎంపికలో ఐసీసీ నిర్ణయమే కీలకం. తిరువనంతపురంలో తొలిసారి వార్మప్ మ్యాచ్‌ను నిర్వహిస్తున్నారు. అందులోనూ ఎన్నోసార్లు చర్చల తర్వాతే నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఈసారి చాలా స్టేడియాలు కొత్తగా ఆతిథ్యం ఇవ్వబోతున్నాయి" అని శుక్లా వెల్లడించారు.

## వరల్డ్ కప్ ఎఫెక్ట్.. అహ్మదాబాద్‌లో కొండెక్కిన హోటల్ రూమ్ టారిఫ్‌లు!

వన్డే ప్రపంచ కప్ మెగా టోర్నీకి ఇంకా వంద రోజుల సమయం ఉంది. ఇప్పటికే షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసిన విషయం తెలిసిందే. అక్టోబర్ 5 నుంచి అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది. అక్టోబర్ 15వ తేదీన ఇదే స్టేడియంలో భారత్ – పాకిస్థాన్ మ్యాచ్ జరగనుంది. ఫైనల్ సహా ఐదు మ్యాచ్‌లు అహ్మదాబాద్ వేదికలోనే జరుగుతాయి. ఈ క్రమంలో అహ్మదాబాద్‌లో హోటల్ రూమ్ టారిఫ్‌లు ఆకాశాన్ని తాకాయి. సాధారణ రోజుల్లో రూ. 6,500 నుంచి రూ. 10,500 ఉండే ఫైవ్ స్టార్ హోటల్ గది అద్దె ఏకంగా.. రూ. 50 వేలు దాటిపోవడం గమనార్హం. మూడు నెలల ముందు బుక్ చేసుకున్నా ఇదే టారిఫ్ ఉన్నట్లు హోటల్ ఇండస్ట్రీ వర్గాలు పేర్కొన్నాయి.

# సత్తా చాటిన సికందర్ రజా, నికోలస్ పూరన్



ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో జింబాబ్వే ఆల్‌రౌండర్ సికందర్ రజా, విండీస్ వైట్‌బాల్ స్పెషలిస్ట్ నికోలస్ పూరన్ సత్తా చాటారు. వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్–2023లో అద్భుతమైన ప్రదర్శనల కారణంగా వీరు ర్యాంకింగ్స్‌లో తమ స్థానాలను మెరుగుపర్చుకున్నారు. పూరన్ 13 స్థానాలు జంప్ చేసి టాప్ 20లోకి (19వ స్పాట్) ప్రవేశిస్తే.. సికందర్ రజా 7 స్థానాలు మెరుగుపర్చుకుని 27వ ప్లేస్‌కు ఎగబాకాడు. వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో బంతితోనూ సత్తా చాటిన సికందర్.. ఆల్‌రౌండర్ల విభాగంలోనూ రెండు స్థానాలు మెరుగుపర్చుకుని మూడో ప్లేస్‌కు చేరాడు. బౌలింగ్‌లో 4 మ్యాచ్‌ల్లో 18 వికెట్లతో చెలరేగిన లంక స్పిన్నర్ వనిందు హసరంగ 2 స్థానాలు మెరుగుపర్చుకుని 24వ ప్లేస్‌కు చేరగా.. జింబాబ్వే పేసర్ రిచర్డ్ నగరవ 27 స్థానాలు మెరుగుపర్చుకుని 32వ స్థానానికి ఎగబాకాడు. వీరితో పాటు క్వాలిఫయర్స్‌లో సత్తా చాటిన మరికొందరు బ్యాటర్లు కూడా ర్యాంకింగ్స్‌ను మెరుగుపర్చుకున్నారు. 3 ఫిఫ్టిలతో రాణించిన నెదర్లాండ్స్ కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ 24 స్థానాలు మెరుగుపర్చుకుని 40వ ర్యాంక్‌కు, జింబాబ్వే సీన్ విలియమ్స్ 10 స్థానాలు మెరుగుపర్చుకుని 43వ ప్లేస్‌కు చేరుకున్నారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగంలో టాప్–10 స్థానాల్లో మాత్రం ఎలాంటి మార్పులు లేవు. బ్యాటింగ్‌లో బాబర్ ఆజమ్, బౌలింగ్‌లో హాజిల్‌వుడ్ అగ్రస్థానాల్లో కొనసాగుతున్నారు. భారత్ నుంచి బ్యాటింగ్ విభాగంలో శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ టాప్ 10లో ఉండగా.. బౌలింగ్‌లో సిరాజ్ ఒక్కడే టాప్–10లో ఉన్నాడు.

# కివీస్‌కు షాకిచ్చిన శ్రీలంక.. 9 వికెట్ల తేడాతో ఘన విజయం




3 వన్డేలు, 3 టీ20ల సిరీస్‌ల కోసం న్యూజిలాండ్ మహిళా క్రికెట్ జట్టు శ్రీలంకలో పర్యటిస్తుంది. సిరీస్‌లో భాగంగా గాలే వేదికగా తొలి వన్డే జరిగింది. వర్షం కారణంగా 28 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో శ్రీలంక డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 9 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను మట్టికరిపించింది. లంక కెప్టెన్ చమారి ఆటపట్టు (83 బంతుల్లో 108; 10 ఫోర్లు, 5 సిక్సర్లు) అద్భుత శతకంతో తమ జట్టును విజయతీరాలకు చేర్చింది. ఆమెకు విష్మి గుణరత్నే (50) సహకరించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్.. 28 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. మెలీ కెర్ర్ (40) టాప్ స్కోరర్‌గా నిలువగా.. మ్యాడీ గ్రీన్ (39), బేట్స్ (28), ప్లిమ్మర్ (22 నాటౌట్) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. కివీస్ బౌలర్లలో సుగంధిక కుమారి, కవిష దిల్హారి, రణవీర తలో వికెట్ పడగొట్టారు. అనంతరం 171 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన శ్రీలంక.. చమారి ఆటపట్టు (108 నాటౌట్), విష్మి గుణరత్నే (50) చెలరేగడంతో 27 ఓవర్లలో కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి అలవోకగా విజయం సాధించింది. ఫలితంగా 3 మ్యాచ్ సిరీస్‌లో 1–0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ మ్యాచ్‌లో సెంచరీతో విజృంభించిన లంక కెప్టెన్ చయారి ఓ అరుదైన రికార్డు సాధించింది. శ్రీలంక తరఫున మహిళల క్రికెట్‌లో 3000 పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డుల్లోకెక్కింది. 49 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఆమె ఈ మైలురాయిని చేరుకుంది. చమారి 93 వన్డేల్లో 33.61 సగటున 3059 పరుగులు సాధించింది. ఓవరాల్‌గా మహిళల వన్డే క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో టీమిండియా మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ 7805 పరుగులతో అగ్రస్థానంలో ఉంది.

# సచిన్‌ను మోయడమా.. మా వల్ల కాదన్నాం: సెహ్వాగ్

ఈ ఏడాది చివర్లో భారత్ వేదికగా వన్డే ప్రపంచకప్ నిర్వహణకు అంతా సిద్ధమవుతోంది. ఇప్పటికే ఐసీసీ షెడ్యూల్ విడుదల చేసింది. ఇక ఈసారి స్వదేశంలో జరగనున్న మెగా టోర్నీని గెలిచి..సుదీర్ఘకాలంగా ఉన్న ఐసీసీ ట్రోఫీల కొరతను తీర్చాలని టీమ్‌ఇండియా అభిమానులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో 2011లో ధోనీ నేతృత్వంలో రెండోసారి ప్రపంచకప్‌ను నెగ్గిన నాటి క్షణాలను మాజీ డ్యాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ పంచుకున్నాడు. భారత్ విజేతగా నిలిచిన వెంటనే.. మైదానంలో ఆటగాళ్ల సంబరాలు అంబరాన్నంటాయి. సచిన్‌ను ఏకంగా భుజాలకెత్తుకొని మైదానం మొత్తం కలియదిరిగారు. దీనికి సంబంధించిన ఓ ఆసక్తికర ఘటనను సెహ్వాగ్ తాజాగా వెల్లడించాడు. అప్పట్లో తాము మాస్టర్‌బ్లాస్టర్‌ను భుజాలపై ఎక్కించుకోకపోవడానికి కారణముందని తెలిపాడు."సచిన్ చాలా బరువు ఉంటాడు. మేం ముసలోళ్లం..(నవ్వుతూ) మాకు భుజాల నొప్పులున్నాయి.. ధోనీకి మోకాలి గాయం ఉంది. మరికొందరు ఆటగాళ్లకు మరికొన్ని సమస్యలున్నాయి. అందుకే.. ఆ భారాన్ని యువ ఆటగాళ్లకు వదిలేశాం. మీరెళ్లి సచిన్‌ను ఎత్తుకొని మైదానంలో రౌండ్ కొట్టి రండి అని చెప్పాం. అందుకే విరాట్ అతడిని మోశాడు" అని సరదాగా వీరు వెల్లడించాడు. ఐసీసీ వరల్డ్‌కప్ 2023 షెడ్యూలింగ్ ఈవెంట్‌లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. 2011 ప్రపంచకప్‌లో సచిన్ అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా నిలిచాడు. ఈ టోర్నీలో అతడు 9 మ్యాచ్‌ల్లో 53.55 సగటుతో 482 పరుగులు చేశాడు. మరోవైపు సెహ్వాగ్ 8 మ్యాచ్‌ల్లో 380 పరుగులు సాధించాడు. ఇక టోర్నీ మొత్తంలో యువరాజ్ చెలరేగిపోయాడు. తొమ్మిది మ్యాచ్‌లకు గాను 8 ఇన్నింగ్స్‌ల్లో బ్యాటింగ్ చేసి 362 పరుగులు సాధించాడు.. ఇక బౌలింగ్‌లో కూడా 14 వికెట్లు పడగొట్టాడు







# ఆ స్టార్ హీరోయిన్ ఇంత గ్యాప్ ఎందుకు తీసుకున్నట్లు?



అనీల్ కపూర్ వారసురాలిగా ఎంట్రీ ఇచ్చిన సోనమ్ కపూర్ అనతి కాలంలో స్టార్ హీరోయిన్ల లీగ్ లో చేరింది. వైవిధ్యమైన పాత్రలతో పాటు నాయికా ప్రాధాన్యత గల చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరించింది. సోనమ్ పెర్ఫార్మెన్స్ తోనే వేగంగా లేడీ ఓరియేంటెడ్ సినిమాల్లో అవకాశాలు అందుకోగల్గింది. సాధారణంగా ఉమెన్ సెంట్రిక్ చిత్రాలకు రీచ్ అవ్వాలంటే? నటిగా స్టార్ డమ్ పీక్స్ లో ఉంటే తప్ప పనవ్వదు. కానీ సోనమ్ ఆ రేంజ్ కి రీచ్ కాకుండానే కేవలం ప్రతిభతోనే ఆ తరహా పాత్రలు అందుకున్న ఏకైక నటిగా చెప్పొచ్చు.అయితే పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చేసింది. ఆ వెంటనే గర్భం దాల్చడంతో కొన్నాళ్ల పాటు వెండి తె రపై సోనమ్ మెరుపులే కరువయ్యాయి. ఆమె సినిమాలు చేసి నాలుగేళ్లు అవుతుందంటే? నమ్ముతారా? అవును! సోనమ్ కపూర్ నటించిన సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చి నాలుగేళ్లు అవుతుంది. మధ్యలో కరోరా కారణంగా రెండేళు తీసేసినా సోనమ్ కుటుంబ జీవితం కోసం రెండేళ్లు కేటాయించినట్లు తెలుస్తోంది. ఆమె చివరిగా 'ది జోయ్ ఫ్యాక్టరీ'లో నటించింది. ఆ తర్వాత 'ఏకెవర్సెస్ ఏకె' లో గెస్ట్ అప్పిరియన్స్ ఇచ్చింది.ఆ తర్వాత సోనమ్ బాలీవుడ్ లోనే పత్తా లేకుండా పోయింది. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో పరిమితం ఫోటోలతో టచ్ లో ఉండటం తప్ప ఇక్కడా మరీ అంత యాక్టివ్ గా లేదు. అయితే రావడం ఆలస్యమైనా బలమైన కంటెంట్ ఉన్న సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం ఈ బ్యూటీ 'బ్లైండ్ ' అనే ఓ సినిమా చేస్తుంది. జియో అనే ఓ అంధురాలి పోలీస్ పాత్రలో నటిస్తుంది. షోమ్ ముఖీజా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి.ఇదొక క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కుతున్నట్లు తెలుస్తుంది. స్కాట్ లాండ్ లో తప్పిపోయిన చాలా మంది మహిళలకు సంబంధించిన కేసులో సాయం చేస్తానంటూ సోనమ్ చెప్పిన డైలాగ్ ఆకట్టుకుం టుంది. సినిమా సమాజానికి చక్కని సందేశాన్ని ఇస్తుందని యూనిట్ ధీమా వ్యక్తం చేస్తుంది.కంటెంట్ పరంగా సినిమా హైలైట్ అవుతుంది. దీంతో సినిమాపై అంచనాలు భారీగా ఏర్పడుతున్నాయి. కంటెంట్ ఎంపికలో సోనమ్ ప్రత్యేకత వేరు. కమర్శియల్ సినిమాలకంటే నటనకు..పాత్రకి గుర్తింపు వచ్చేలా జాగ్రత్త పడుతుంది. ఈ క్వాలిటీనే సోనమ్ ని మిగతా భామల నుంచి వేరు చేస్తుంది.

## నిఖిల్ స్పై.. వరల్డ్ వైడ్ గా థియేటర్స్ లెక్క ఇదే!

నిఖిల్ సిద్దార్థ కార్తికేయ 2 18 పేజెస్ సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకొని ఫుల్ ఫామ్ లో ఉన్నారు. ఇప్పుడు మరో పాన్ ఇండియా సినిమా ' స్పై ' తో రాబోతున్నారు. ఐశ్వర్య మీనన్ హీరోయిన్ గా నటించింది. ఎడిటర్ గ్యారీ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఇంకో రోజులో జూన్ 29న పాన్ ఇండియా సినిమాగా ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ కానుంది.ఇప్పటికే ఈ సినిమాపై సినీ ప్రియుల్లో భారీగా అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో సినిమా ఎన్ని థియేటర్స్ లో రిలీజ్ కానుందో వివరాలు బయటకు వచ్చాయి. వరల్డ్ వైడ్ గా 1605కు పైగా థియేటర్లలో గ్రాండ్ గా రిలీజ్ కానున్నట్లు సమాచారం అందింది. నైజాంలో 235కు పైగా సీడెడ్ లో 120కు పైగా ఆంధ్రాలో 280కు పైగా థియేటరలలో విడుదల అవ్వనునట్లు తెలుస్తోంది.మొత్తంగా తెలుగు రాష్ట్రాలు ఏపీ తెలంగాణ కలిపి 635కి పైగా థియేటర్స్ లో చిత్రం సందడి చేయనుంది.అలాగే కర్ణాటక రెస్ట్ ఆఫ్ ఇండియాతో పాటు ఇతర భాషల్లో కలిపి 550కు పైగా థియేటర్లలో ప్రదర్శన కానుందట. ఓవర్సీస్ లో 420కు పైగా థియేటర్లలో అని అంటున్నారు.ఈ లెక్కన ప్రపంచ వ్యాప్తంగా 1605కు పైగా థియేటర్లలో గ్రాండ్ గా విడుదల కానుందని తెలిసింది. ఇక ఈ సినిమా ప్రీ రిలీజ్ బిజినెస్ విషయానికొస్తే.. ఇప్పటికీ కార్తికేయ 2 తర్వాత నిఖిల్ మార్కెట్ కూడా బాగానే పెరిగింది. దీంతో స్పై సినిమాకు థియేట్రికల్ నాన్ థియేట్రికల్ బిజినెస్ బాగా జరిగినట్లు తెలిసింది. థియేటర్ హక్కులను రూ.18కోట్ల వరకు విక్రయించినట్టు సమాచారం అందింది. అంటే బ్రేక్ ఈవెన్ టార్గెట్ రూ.18.50 కోట్లు. నిఖిల్ కెరీర్లో ఇదే హైయెస్ట్ బ్రేక్ ఈవెన్ టార్గెట్. ఆంధ్రాలో రూ. 6 కోట్లు నైజాంలో రూ. 5 కోట్లు సీడెడ్ రూ.2 కోట్లు ఓవర్సీస్లో రూ.1.75కోట్లు ఇతర రాష్ట్రాలు రూ.70 లక్షలకు విక్రయించారని బయట లెక్కలు వస్తున్నాయి.ఇప్పటికే నిఖిల్ సినిమాలకు నార్త్ లో డిమాండ్ ఏర్పడటం స్పై మీద అంచనాలు భారీగా ఉండటంతో.. ఈ సినిమా బ్రేక్ ఈవెన్ టార్గెట్ ఈజీగానే అందుకుంటుందని భావిస్తున్నారు.




# నాగశౌర్య రియల్ లైఫ్ లో రంగబలే!



యంగ్ హీరో నాగశౌర్యకి సరైన సక్సెస్ పడి చాలా కాలమవుతోంది. 'ఛలో' తర్వాత చాలా సినిమాలు చేసాడు. కానీ వాటి సక్సెస్ సౌండ్ అంతగా వినిపించలేదు. యావరేజ్ విజయాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కానీ రేసులో కొనసాగలంటే ఈ సక్సెస్ సరిపోదు.బాక్సాఫీస్ ని షేక్ చేసే హిట్ కావాలి. అలాంటి విజయం కోసం యంగ్ హీరో తపిస్తున్నాడు. ప్రస్తుతం రెండు..మూడు సినిమాలు చేస్తున్నాడు. వాటిలో ఒకటి 'రంగబలి'. పవన్ బాసిరెడ్డి దర్శకత్వం వహిస్తోన్న సినిమా త్వరలో రిలీజ్ కానుంది.ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అవుతోంది. ఈ సినిమా ప్రమోషన్ లో భాగంగా నాగశౌర్య సినిమా కంటెంట్ ని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. వ్యక్తిగతంగా సినిమాలో పాత్ర తనకెంతో దగ్గరగా ఉంటుందన్నాడు. ఇక ఈ సినిమాలో లైన్ చూస్తే బయట ఊరిలో బానిసలా బ్రతికినా..సొంతూరిలో సింహంలా బ్రతకాలి అన్నది కాన్సెప్ట్ . అలా భావించే ఓ కుర్రాడి చుట్టూ తిరిగే కథ.ఆ కథలో కుర్రాడు నాగశౌర్య. అంటే నాగశౌర్య వ్యక్తిగతంగా ఎలా ఫీలవుతాడు? అన్నది ఈసినిమా ద్వారా కొద్దోగొప్పో తెలిసే అవకాశం ఉంది. ప్రతీ మనిషి పేరు మీద సొంత ఇల్లు ఉండకపోవచ్చు. సొంత పొలం ఉండకపోవచ్చు. కానీ సొంతూరైతే ఉంటుందిగా. ఇలా కొన్ని అంశాల్ని బేస్ చేసుకుని చిత్రాన్ని..అందులో పాత్రల్ని సృష్టించారు. అలాంటి ఓ పాత్ర యాదృశ్చికంగా నాగశౌర్య రియల్ లైఫ్ కి దగ్గరైంది.మరి ఈ కథని..ఆ పాత్రని దర్శకుడు ఎలా ఎగ్జిక్యూట్ చేసాడో చూడాలి. ఇందులో నాగశౌర్యకి జోడీగా యుక్తి తరేజా నటించింది. జోడీ బాగుంటుందని శౌర్య అంటున్నాడు. అలాగే సినిమా లో ఎంతో అందంగా హీరోయిన్ కనిపిస్తుందని అంటున్నారు.సినిమాపై యూనిట్ కాన్ఫిడెంట్ గా ఉంది. హిట్ ఇచ్చి యంగ్ హీరో కెరీర్ ని పట్టాలెక్కించాలని టీమ్ భావిస్తోంది. అలాగే నాగశౌర్య 'నారీ నారీ నడుమ మురారీ'..'పోలీస్ వారి హెచ్చరిక' సినిమాలు చేస్తున్నాడు. అవి సెట్స్ లో ఉన్నాయి.



# కీరవాణి తనయుడి కోసం మెగా సపోర్ట్




మెగాస్టార్ చిరంజీవి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండటం ఆయన గొప్ప లక్షణం. ఆయన్ను చూసే ఎంతో మంది స్పూర్తి చెంది సినిమా ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టారు. అలాగే చిరు కూడా ఎంతో మంది నటీనటులను టెక్నీషియన్స్ ను ప్రోత్సహిస్తూనే ఉంటారు. అప్ కమింగ్ హీరోస్ డైరెక్టర్స్ చేసే కొత్త సినిమాలకు విషెస్ తెలుపుతూ వారి ప్రమోషన్ ఈవెంట్లకు హాజరై వారిలో ఉత్సాహన్ని నింపుతారు.తాజాగా భాగ్ సాలే టీమ్ కు మెగాస్టార్ చిరంజీవి బెస్ట్ విషెస్ తెలిపారు. శ్రీసింహా కోడూరి హీరోగా నటించిన కొత్త సినిమానే భాగ్ సాలే. నేహా సోలంకి హీరోయిన్ గా నటించింది. జూలై 7న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి... సినిమా ట్రైలర్ చూసి బాగుందని ప్రశంసించారు.మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ .. భాగ్ సాలే సినిమా ట్రైలర్ బాగుంది. శ్రీసింహా తనకంటూ ఓ ప్రత్యేక ఇమేజ్ ఏర్పర్చుకుంటున్నాడు. కామెడీ మాస్ ఎంటర్ టైనింగ్ తో పాటు క్రైమ్ నేపథ్యం సినిమాలు చేస్తూ గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. శ్రీసింహా.. కీరవాణి గారి అబ్బాయి అని అతను హీరోగా పేరు తెచ్చుకునే వరకు నాకు తెలియదు. వారసుడిగా కాకుండా తను స్వతహాగా ఎదగాలని ప్రయత్నిస్తున్నాడు.కీరవాణి గారికి పేరు తెచ్చేంతగా గుర్తింపు సంపాదించుకోవాలని కోరుకుంటున్నాను. అలాగే కాలభైరవ అంటే చరణ్ కు చాలా ఇష్టం. ఇకపైనా కూడా వీరు మంచి అవకాశాలతో తమ ప్రతిభను చాటుకోవాలి. దర్శకుడు ప్రణీత్ బ్రహ్మాండంగా ఈ సినిమాను రూపొందించారు. అలాగే నిర్మాత అర్జున్ దాస్యన్ మంచి ప్రయత్నం చేశారు. ఈ సినిమా జూలై 7న విడుదలవుతోంది. సినిమా సూపర్ హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను అని అన్నారు.భాగ్ సాలే సినిమా విషయానికొస్తే.. ఈ చిత్రాన్ని వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్ పై బిగ్ బెన్ సినీ వ్యాలీ మూవీస్ అసోసియేషన్ తో అర్జున్ దాస్యన్ యష్ రంగినేని కల్యాణ్ సింగనమల సంయుక్తంగా నిర్మించారు. సోలంకి కథానాయిక. ప్రణీత్ బ్రాహ్మండపల్లి దర్శకత్వంలో క్రైమ్ కామెడీ గా ఈ సినిమా రూపొందింది.

# ముఖమంతా బొక్కలే..నువ్వు హీరోనా?

'డీజేటిల్లు' సక్సెస్ తో సిద్దు జొన్నలగడ్డ క్రేజీ స్టార్ గా మారిపోయిన సంగతి తెలిసిందే. ఈ సినిమా సక్సెస్ సిద్దు స్థాయినే మార్చేసింది. అవకాశాలు క్యూ కడుతున్నాయి. అతని మ్యానరిజమ్ ని బేస్ చేసుకుని స్టోరీలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం 'టిల్లుస్క్వేర్' అంటూ మరో కొత్త చిత్రంలో నటిస్తున్నాడు. అలాగే ఓ మలయాళం సినిమా



రీమేక్ లోనూ నటిస్తున్నాడు. ఇక సోషల్ మీడియాలో సిద్దు నిత్యం వైరల్ అవుతునూ ఉంటాడు. సెలబ్రిటీలు ఇంటర్వ్యూలు..వైవిధ్యమైన డ్రెస్సింగ్ సెన్స్ తో ఆకట్టుకుంటున్నాడు.ఇదంతా తనకి ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా తనకు తాను సాధించుకున్నదే. అవును 'జోష్' సినిమాతో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా పరిచయమైన నటుడీయన. ఆ తర్వాత 'ఆరెంజ్'..'భీమిలి కబడ్డి జట్టు' ఇలా చాలా సినిమాలు చేసాడు.అయితే 'గుంటూరు టాకీస్' సినిమాతో తన లో ఇంటర్నల్ ట్యాలెంట్ ని బయట పెట్టే అవకాశం వచ్చింది. ఆ సినిమాలో నటించడంతో పాటు డైలాగ్ రైటర్ గాను పనిచేసాడు. ఆ సినిమా బాగానే ఆడింది. దీంతో కుర్రాడిలో విషయం ఉందని దర్శక-నిర్మాతలు ప్రోత్సహించారు.ఆ తర్వాత పలు సినిమాలకు రైంటింగ్ విభాగంలోనూ పనిచేసాడు. అయితే కెరీర్ ఆరంభంలో అవమానాలు చాలానే ఎదుర్కున్నాడు. ఈ విషయాన్ని ఓ సందర్భంలో రివీల్ చేసాడు. ఆవేంటో ఆయన మాటల్లోనే..'అయిదారేళ్ల కిందట ఒకతను అన్న మాటలు ఎప్పటికీ మర్చిపోలేను.నా ముఖం మీద మొటిమలు వాటి తాలుకా మచ్చలుంటాయి. గుంతలు కూడా ఉంటాయి. సినిమాల్లో ప్రయత్నాలు చేసేటప్పుడు ఈ ముఖంతో హీరో అవుదామని ఎలా అనుకున్నావ్? అని నా ముఖం మీదనే ఒకరు అన్నారు.ఆ మాట తట్టుకోలేక ఏడ్చేసాను. కానీ జీవితంలో ఏది పరిపూర్ణం కాదు. పట్టుదలతో ప్రయత్నిస్తే సాధించలేనిది అంటూ ఏదీ ఉండదు అని నాకు నేనే ధైర్యం తెచ్చుకుని ఇంకా కసిగా ప్రయత్నాలు చేసేవాడిని' అని అన్నారు.

# నిర్మాత అతి పొదుపుతో యువ హీరోకి చిక్కులు!




సినీ నిర్మాతలకు ప్రచార బడ్జెట్ల విషయంలో స్పష్టత ఉండాలి. షూటింగ్ సమయంలో లేదా ప్రచార సమయంలో అవసరమైన బడ్జెట్లు లేదా పెట్టుబడులతో సిద్ధంగా ఉండాలి. అలాగే నటీనటుల పారితోషికాలు ఇతర ముందస్తు కట్టుబాట్ల విషయంలో నిజాయితీ తప్పనిసరి.పెట్టుబడులు బడ్జెట్ల విషయంలో ప్రతిదీ ప్రణాళికాబద్ధంగా సాగాలి. కానీ కీలక అవసరాల్లో సదరు నిర్మాత అతి పొదుపుతనం ఓ యువ హీరోని అవమానాల పాల్జేసిందని ఫిలింనగర్ లో గుసగుసలాడుకుంటున్నారు.ఇటీవల రిలీజ్ కి సిద్ధమైన ఓ సినిమా ప్రచారం కోసం విశాఖలోని ఓ హోటల్ లో సదరు చిత్రబృందం బస చేసారట. అయితే "రూమ్ లు బుకింగ్ వరకే.. తినే తిండి బిల్లులు హీరో కడతాడు!" అంటూ ఆ హోటల్ వాళ్లతో సదరు నిర్మాత ముందే మాట్లాడుకున్నాడట. దీనిని బట్టి అతడి స్థాయి అర్థమవుతోంది.అంతేకాదు ముందస్తు కట్టుబాటు ప్రకారం తన హీరోకి ఇవ్వాల్సిన పారితోషికం నుంచి 40శాతం ఫీజు కోత కూడా విధించాడట. హోటల్ నుంచి వస్తూ బిల్లులు చెల్లించిన హీరో దానిని అవమానంగా భావించాడని గుసగుసలు వినిపిస్తున్నాయి.ఇలాంటి నిర్మాతలు పరిశ్రమలో కొందరుంటారు. పొదుపు పేరుతో చేసే ఇలాంటి పనులతో ఇతర బృందానికి ఇబ్బందులు తప్పదు. పొదుపు మంచిదే.. కానీ అతి పొదుపు కూడదు. మరీ ఇంత పొదుపైన నిర్మాతకు మరోసారి ఆ హీరో కాల్షీట్లు ఇస్తాడా? పైగా ఇతర హీరోలకు ఇది తెలియకుండా ఉంటుందా? అలాంటప్పుడు ఆ నిర్మాతను నమ్మి హీరోలు సినిమాలకు అంగీకరిస్తారా?అంటూ ఫిలింనగర్ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.సర్ధుకుపోయే మంచి మనస్తత్వం ఉంది కాబట్టి ఆ హీరో సర్ధుకుపోయాడు. గొడవపడే మనస్తత్వం ఉన్న ఇంకెవరైనా నటుడు అయితే ఆ నిర్మాత గుట్టును బయటపెట్టేసేవారని కూడా గుసగుస వినిపిస్తోంది.

# గాండివధారి అర్జున మళ్లీ కన్ఫర్మ్

మెగా హీరో వరుణ్ తేజ్ ప్రస్తుతం నటిస్తున్న చిత్రం గాండివధారి అర్జున విడుదల విషయంలో మేకర్స్ మరోసారి క్లారిటీ ఇచ్చారు. ఆగస్టు 25న సినిమాను విడుదల చేయబోతున్నట్లుగా గతంలోనే ప్రకటన వచ్చింది. కానీ అదే అగస్టు లో మెగాస్టార్ చిరంజీవి సినిమా విడుదల అవ్వబోతున్న విషయం తెల్సిందే.చిరు మూవీ ఉన్న కారణంగా ఆగస్టు లో వరుణ్ సినిమా రావడం అనుమానమే అన్నట్లుగా పుకార్లు షికార్లు చేశాయి. అంతే కాకుండా గాండివధారి అర్జున సినిమా షూటింగ్ ఇంకా పూర్తి అవ్వలేదని కూడా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యం లో సినిమా ఆగస్టు లో విడుదల అవ్వడం సాధ్యం కాకపోవచ్చు అనే వార్తలు వచ్చాయి.వాటన్నింటిని కొట్టి పారేస్తూ వరుణ్ తేజ్ ఎట్టిపరిస్థితుల్లో ఆగస్టు 25న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లుగా మరోసారి క్లారిటీ ఇచ్చారు. చిత్ర యూనిట్ సభ్యులు ఈ పోస్టర్ ను విడుదల చేయడం ద్వారా సినిమా ఆగస్టు లోనే వస్తుందని స్పష్టతను ఇచ్చారు. అంతే కాకుండా సినిమా యొక్క షూటింగ్ కార్యక్రమాలు పూర్తి అయ్యాయని కూడా పేర్కొన్నారు.ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న గాండివధారి అర్జున సినిమా యొక్క ప్రమోషన్ కార్యక్రమాలు మెల్లగా షురూ అయ్యే అవకాశాలు ఉన్నాయి. మిక్కీ జే మేయర్ సంగీతాన్ని సమకూర్చుతూ ఉండగా ఈ సినిమాకు ప్రవీణ్ సత్తార్ దర్శకత్వం వహిస్తున్నాడు.బివిఎస్ఎన్ ప్రసాద్ ఈ సినిమా ను భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నాడు. ఈ సినిమాలో హీరోయిన్ గా ఉత్తరాది ముద్దుగుమ్మ సాక్షి వైద్య నటిస్తున్న విషయం తెల్సిందే.

## సర్వీస్ ఫీజు లేకుండా సర్టిఫికెట్ల జారీ"

**రవి చంద్రా రెడ్డి మున్సిపల్ కమిషనర్**





నంద్యాల మా ప్రతినిధి జూన్ 28 విభారె న్యూస్ :-జనన, మరణ, కుల, ఆదాయ, కుటుంబ, వివాహ ధృవీకరణ పత్రాలు, లావాదేవీ మ్యుటేషన్ లు, ఫోన్ నెంబర్ కు ఆధార్ అనుసంధానం, పంట సాగు కార్డులు, కొత్త రేషన్ కార్డు లేదా రేషన్ కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో మార్పులు చేర్పులు వంటి 11 రకాల సర్టిఫికెట్ లు ఉచితంగా జారీతో పాటు ఇతర అవసరమైన సర్టిఫికెట్లను కూడా అందించనున్నారని మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక 21 వార్డు మరియు 5 వార్డు సచివాలయాలలో సచివాలయ సిబ్బంది కి జగనన్న సురక్ష పథకం గురించి తగు సూచనలు చేశారు. సకాలంలో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు . అనంతరం హరిజన వాడ. నూనెపల్లె. యందు శానిటేషన్. డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపర్వైజర్ లక్ష్మీనారాయణ. శానిటేషన్ ఇన్స్పెక్టర్. శివ ప్రసాద్ రెడ్డి. సచివాలయ సిబ్బంది. శానిటేషన్ మేస్త్రీలు. తదితరులు పాల్గొన్నారు.

## ఫీజులు ఎక్కడ కంస మామ- టీఎన్ఎస్ఎఫ్



ఎమ్మిగనూరు టౌన్ జూన్ 28 విభారె న్యూస్విద్యార్థులకు మేనమామగా ఉండి వారి చదువులకయ్యే ఫీజులను చెల్లిస్తానని మాట తప్పి సీఎం జగన్ కంస మామగా మిగిలారని టిఎన్ఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు నాగరాజు అన్నారు.విద్యా వ్యవస్థను ప్రక్షాళన పేరుతో సర్వనాశనం చేస్తున్నారని విమర్శించారు.బుధవారం స్థానిక సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో 21 వ వార్డు కౌన్సిలర్ దయాసాగర్ తో కలిసి "కంస మామ ఫీజులు ఎక్కడ" పోస్టర్ను విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులను చదువులకు దూరం చేస్తున్నారని జీవో నెంబర్ 51,52 ద్వారా ఎయిడెడ్ విద్యాసంస్థలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు.జీవో నెంబర్ 71 రద్దు చేసి పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలని ఈ సందర్భంగా కోరారు ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ కార్యకర్తలు అర్జున్ శివ భీమా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డులలో అభివృద్ధి పనులకు శ్రీకారం





ఎమ్మిగనూరు టౌన్ జూన్ 28 విభారె న్యూస్ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందని వైసిపి పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి అన్నారు.స్థానిక 16వ వార్డులో అభివృద్ధి పనులకు బుధవారం భూమి పూజ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.16వ వార్డులో ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న కల్వర్టు సిసి రోడ్డు సమస్యలను పరిష్కార దిశలో నిర్మాణాలు చేపట్టామన్నారు 5 ,6 వార్డులలో పైపులైన్ నిర్మాణాలనుప్రారంభిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కె ఎస్ రఘు వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్ ఆయా వార్డు కౌన్సిలర్లు సచివాలయ సిబ్బంది పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్రం ఇచ్చిన నిధులతో రాష్ట్ర ప్రభుత్వం తామే ఇస్తున్నట్లు స్టిక్కర్లు వేసుకోవడం సిగ్గు చేటు-- డా.బైరెడ్డి శబరి





నంద్యాల మా ప్రతినిధి జూన్ 28 విభారె న్యూస్ :- దేశంలో పేద ప్రజల సక్షేమమే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్ష్యం అని బీజేపీ నంద్యాల పార్లమెంట్ ఇంచార్జి డా.బైరెడ్డి శబరి అన్నారు. నంద్యాల జిల్లా మహాజన సంపర్క్ బహిరంగ సభను విజయవంతం చేసిన వారికి ధన్యవాదాలు తెలుపుతూ బుదవారం ఒక పత్రిక ప్రకటనలో విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో అవినీతి పాలన నడుస్తుందన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులతో రాష్ట్ర ప్రభుత్వం తామే ఇస్తున్నట్లు స్టిక్కర్లు వేసుకోవడం సిగ్గుచేటన్నారు. దేశ అభివృద్ధి కోసం పాటు పడుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం వెంట నడవాలని ఆమె కోరారు. 9 ఏళ్ల నరేంద్ర మోడీ నాయకత్వంలోని బి జె పి పాలన దేశం కోసం సేవచేయడం, సుపరిపాలన అందించడం, పేదల సంక్షేమం ధ్యేయంగా అవినీతి రహిత పాలన కొనసాగిస్తున్నారు. నంద్యాల జిల్లా మహాజన సంపర్క్ బహిరంగ సభకు హాజరైన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురంధేశ్వరికి , నంద్యాల జిల్లా నాయకులకు, కార్యకర్తలకు, ప్రజానీకానికి ధన్యవాదాలు తెలిపారు.

# బదిలీ పై వెళ్లిన ఉపాధ్యాయునిలకు ఆత్మీయ సన్మానం.



కర్నూలు జూన్ 28 విభారె న్యూస్.కర్నూలు మండలం వసంత నగర్ ప్రాథమిక పాఠశాల నుండి మెర్జింగ్ వలన ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ కోడుమూరు మండలము పులకుర్తి పాఠశాల కు, శ్రీమతి బేబీ సుజాత ఎనిమిది సంవత్సారాలు పూర్తి అయినందున దేవనకొండ మండలము గుండ్లకొండ ప్రాథమిక పాఠశాల కు బదలీ పై వెళ్ళారు. నేడు వసంత నగర్ ప్రాథమిక పాఠశాల యందు ఇద్దరికి ఘనసన్మానం తో పాఠశాల సిబ్బంది వీడ్కోలు పలికారు.ఈ కార్రమానికి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె ప్రకాష్ రావు అధ్యక్షత వహించారు. బదలీ లు జరగటం వలన మంచి సహ ఉద్యోగులను కోల్పోవడం బాధాకరమని,వారు ఎక్కడ వున్న బాగుండాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను అన్నారు.ఈ కార్యక్రమం లో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంపత్ కుమార్ ప్రసంగిస్తూ వీరి యొక్క అంకిత భావం, క్రమశిక్షణ అందరికీ ఆదర్శ ప్రాయం అని అన్నారు.ఎస్ సి ఎస్ టి యు రాష్ట్ర నాయకుడు సుబ్బరాయుడు మాట్లడుతూ ఈ పాఠశాల కు వీరు చేసిన సేవలు చిరస్మణీయం,పని చేసే వారు ఎక్కడకు వెళ్ళినా అదే విధంగా పని చేస్తారు.కాబట్టి ఇక్కడ వీరికి లభించిన గౌరవం అక్కడ కూడ లభిస్తుంది అన్నారు. మస్తాన్ వలీ, శ్రీనాథ్,పద్మావతి, మనోహర్, పుల్లన్న ,దత్తాత్రేయ, రోజమ్మ , అంగన్వాడీ సిబ్బంది మధ్యాహ్న భోజన పథకం,సిబ్బంది,పూర్వ విద్యార్ధులు,ప్రస్తుత విద్యార్థులు,గ్రామ పెద్దలు పాల్గొని ప్రసంగించారు. లత వందన సమర్పణ తో వీడ్కోలు సభ ముగిసింది.

## నేషనల్ కన్వీనర్ గా ఎన్నికైన పువ్వాడి చంద్రశేఖర్ కు అభినందనలు తెలిపిన ఎమ్మిగనూరు ఆవోపా సభ్యులు.



ఎమ్మిగనూరు జూన్ 28 విభారె న్యూస్.ప్రపంచ ఆర్యవైశ్య మహాసభల గ్లోబల్ సీనియర్ సిటిజన్స్ ఫోరం నేషనల్ కన్వీనర్ గా ఎన్నికైన పువ్వాడి చంద్రశేఖర్ కు ఎమ్మిగనూరు ఆవోపా సభ్యులు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ వారికి వాసవి మాత ఆశీస్సులు ఎల్లవేళలా కలిగి ఉండాలని వారు కోరారు.

## తల్లుల ఖాతాలో జగనన్న అమ్మఒడి డబ్బులు.

కర్నూలు జూన్ 28 విభారె న్యూస్.జిల్లాలో జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా ఒకటోతరగతి నుండి ఇంటర్మీడియేట్ వరకు 2,42,241 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలలో రూ.363.3615 కోట్లు నేరుగా జమ చేశారు. కర్నూలు మండల పరిధిలోని మిలిటరీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.జి.సృజన, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్,ఎనీపిపి వేంకటేశ్వరమ్మ,ఎంపిటిసి జ్యోతి,తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ప్రజలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన డిసిసి అధ్యక్షులు యం. సుధాకర్ బాబు.

కర్నూలు జూన్ 28 విభారె న్యూస్.ముస్లిం సోదర సోదరీమణులకు జిల్లాకాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు యం సుధాకర్ బాబు బక్రీద్ పండుగ శుభాకాంక్షలుతెలియజేశారు. ముస్లింలకు ముఖ్యమైన పండుగల్లో బక్రీద్ ముఖ్యమయిన పండుగ అని కుటుంబ సభ్యులతో పండుగను భక్తి శ్రద్ధలతో సంతోషంగా జరుపుకుని అల్లాహ్ కృపకు పాత్రులు కాగలరని సుధాకర్ బాబు ఆకాంక్షించారు.



## నేడు తొలి ఏకాదశి (శయన ఏకాదశి) సందర్భంగా అనంతపద్మనాభ స్వామికి విశేష పూజలు.

ఎమ్మిగనూరు జూన్ 28 విభారె న్యూస్. ఎమ్మిగనూరు మంత్రాలయం రోడ్డులో గల శ్రీశ్రీశ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయంలో నేడు తొలి ఏకాదశిని పురస్కరించుకొని అనంత పద్మనాభ స్వామి మూలవిరాట్ కు తులసీ దళ అభిషేకం, తులసీదళ సహస్రనామార్చన నిర్వహించబడును. కావున భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని భగవంతుని కృపకు పాత్రులై పూజ కార్యక్రమము జయప్రదం చేయవలెనని ఆలయ ధర్మకర్త ఆవుల గోపాల్ భక్తాదులను కోరారు. సంప్రదించవలసిన ఫోన్ నెంబరు: 9182296815.



## రీ సర్వే పనులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి

నంద్యాల మా ప్రతినిధి జూన్ 28 విభారె న్యూస్ :- మహానంది మండలం తిమ్మాపురం గ్రామ ప్రాంతాల్లో జరుగుతున్న రీ సర్వే పనులను జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి పరిశీలించారు. బుధవారం మహానంది మండలంలోని తిమ్మాపురం గ్రామ రైతుల పొలాల్లో జరుగుతున్న రీసర్వే పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నిశాంతి. టి రైతులతో ముచ్చటిస్తూ రీ సర్వే పనుల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అంతకుముందు మహానంది మండలంలోని తిమ్మాపురం గ్రామంలో సర్వే నంబర్ 187, 188, 200 లలో జరుగుతున్న రీ సర్వే పనులను పరిశీలించి సర్వేయర్లకు పలు సూచనలు జారీ చేశారు. మహానంది తాసిల్దార్ జనార్దన్ శెట్టి , డిప్యూటీ తాసిల్దార్, పిఓఎల్ఆర్ డిటి తదితరులు జాయింట్ కలెక్టర్ వెంట ఉన్నారు.



# అమ్మ బడి పథకం అమ్మల ఖాతాలకు 217.20 కోట్లు



నంద్యాల మా ప్రతినిధి జూన్ 28 విభారె న్యూస్ :-బుధవారం కలెక్టరేట్ లోని వైయస్సార్ సెంటినరీ హాల్ లో నంద్యాల జిల్లా వ్యాప్తంగా జగనన్న అమ్మ ఒడి పథకం కింద అర్హత కలిగిన తల్లులకు ఒక్కొక్కరికి రూ.15,000 వేలు చొప్పున 1,67,084 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో రూ.217.20 కోట్ల రూపాయల మొత్తాన్ని నేరుగా జమ చేశారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మార్క్ఫెడ్ చైర్మన్ పి.పి నాగిరెడ్డి, మైనారిటీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు హాబీబుల్లా, మున్సిపల్ ఛైర్పర్సన్ మాబున్నిసా, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సునీతా అమృత్ రాజ్, డీఈఓ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ తరగతులు జయప్రదం చేయాలి

**ఏఐఎస్ఎఫ్ జిల్లాకు కార్యదర్శి శ్రీరాములు గౌడ్**



ఎమ్మిగనూరు టౌన్ జూన్ 28 విభారె న్యూస్విద్య వైజ్ఞానిక రాజకీయ సై ధాంతిక శిక్షణ శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు గౌడ్ పిలుపునిచ్చారు స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర థామస్ లు కలిసి శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 4,5,6 తేదీలలో మంత్రాలయంలో రాయలసీమ జిల్లాలస్థాయి లో ఏఐఎస్ఎఫ్ కార్యకర్తల శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం పై చేస్తున్న వ్యతిరేక విధానాలను ఎదుర్కొనటం తదితర అంశాలపై శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యకర్తలు మునిస్వామి ఉదయ్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామికి విశేష పూజలు.

కర్నూలు జూన్ 28 విభారె న్యూస్.తొలి ఏకాదశి స్వాతీ నక్షత్రం,గురువారం ఈ ఏకాదశిని శయన ఏకాదశి అని కూడా పిలుస్తారు.ఈరోజు నుండే చాతుర్మాస్య వ్రత దీక్షలు ప్రారంభం అవుతాయి. గురువారం చేసుకునే దాన ధర్మములు,గో సేవలు, పూజలు, అర్చనలు, హోమములు పవిత్రమైనవి మరియు పుణ్యమైనదిగా పరిగణించబడుతుంది.ఈ తొలి ఏకాదశి నాడుశ్రీ సూర్యనారాయణ స్వామి వారికి విశేషముగా శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ పూర్వకముగా అర్చనలు,సుదర్శన హోమం నిర్వహించడం జరుగుతుంది.భక్తాదులు విష్ణు సహస్ర నామార్చనకు సుదర్శన హోమమునకు గోత్రనామములు నమోదు చేసుకోగలరు.1)విష్ణు సహస్రనామార్చన -150రూ..2) శ్రీ విష్ణు సహస్రనామ సహితముగా సుదర్శన హోమం -3500రూ..(ప్రధానంగా స్వయంగా కూర్చుని భక్తాదులు హోమము చేసుకొనవచ్చును.)(ఉదయం 9 గం.లకు శ్రీ విష్ణు సహస్రనామార్చన ప్రారంభం.)ప్రదోషకాలమునందు (సాయంకాలము)5:30గం. లకు శ్రీ సుదర్శన హోమం ప్రారంభం.)(సంప్రదించగలరు. -8668087703)దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబర్:8896123777.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190